KR TV

మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...

## నేటి మాట

ఓర్పు అనేది ఎంత చేదుగా ఉంటుందో, దాని వల్ల లభించే ప్రతిఫలం అంత తీయగా ఉంటుంది



-స్వామి వివేకానంద

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 02 సంచిక 54 | మంగళవారం 10 ఫిబ్రవరి 2026 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-

### మాతృత్వానికి మరణం.. ప్రేమకు భాష లేదు!




2 లో

### తెలంగాణలో మద్యం దుకాణాలు బంద్




2 లో

### చెప్పిన డేట్‌కే నక్సలిజాన్ని అంతం చేస్తాం: అమిత్ షా



2 లో

### ఎచ్డీఎఫ్సి బ్యాంక్ ఉద్యోగి వీరంగం.. కస్టమర్‌పై కుల వివక్ష వ్యాఖ్యలు



2 లో

### ప్రచారంలో ప్రమాదం.. బాంబు పేలి కార్యకర్తకు తీవ్ర గాయాలు



2 లో

### మద్యం కుంభకోణం కేసు.. రాజ్ కెసిరెడ్డికి సుప్రీంకోర్టులో షాక్



2 లో

### ఏపీలో దారుణం.. 40రోజుల పసికందును నదిలో వదిలేసిన తల్లి



2 లో

# ఎన్డీయే ప్రభుత్వం చర్చకు భయపడుతోంది : రాహుల్ గాంధీ



2 లో

న్యూస్ డెస్క్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఎన్డీయే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రస్తుతం పార్లమెంట్ వేదికగా జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లోని పరిణామాలపై రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంట్ ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను మాట్లాడుతుండగా ఎంపీలు అడ్డుకున్నారని, తాను మాట్లాడటం వారికి ఇష్టం లేదని, సభలో చర్చకు ఎన్డీయే ప్రభుత్వం భయపడుతోందని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు.

నరవాణే పుస్తకం పై వివాదం

పార్లమెంట్ సమావేశాలను కుదిపేస్తున్న నరవాణే పుస్తకం వివాదంపై మాట్లాడుతూ.. మాజీ సైన్యాధిపతి జనరల్ నరవాణే రాసిన పుస్తకం గురించి నేను సభలో ప్రస్తావించకూడదని ప్రభుత్వం పదేపదే అడ్డుకుందని రాహుల్ ఆరోపించారు. మొదట పుస్తకాన్ని కోట్ చేయకూడదన్నారని, ఆ తర్వాత మ్యాగజైన్ గురించి మాట్లాడుతున్న ఒప్పుకోలేదని ఆయన పేర్కొన్నారు. చివరకు రక్షణ మంత్రి ఆ పుస్తకం అసలు ప్రచురణ కాలేదని అబద్ధం చెప్పారని, కానీ తమ దగ్గర ఆ పుస్తకం కాపీ ఉందని రాహుల్ స్పష్టం చేశారు.

విపక్షాల గొంతు నొక్కుతున్నారు

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రతిపక్ష నాయకుడిని, ఇతర సభ్యులను మాట్లాడనీయకుండా అడ్డుకుంటున్నారని ఆయన మండిపడ్డారు.

## ఏపీలో ప్రమాదకర స్థాయిలో టీనేజ్ ప్రెగ్నెన్సీలు.. దీనివల్ల నష్టాలేంటి?



2 లో

న్యూస్ డెస్క్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్ లో టీనేజీ ప్రెగ్నెన్సీలు ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. పాపులేషన్ మేనేజ్‌మెంట్ సర్వేలో 2025-26 సంవత్సరానికి నమోదైన గణాంకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా సగటున 8.8 శాతం మంది టీనేజీ యువతులు ప్రెగ్నెంట్ అవుతున్నారు. అత్యధికంగా కుప్పం నియోజకవర్గంలో 14.9 శాతం టీనేజీ ప్రెగ్నెన్సీలు నమోదైనట్లు హెల్త్ సెక్రటరీ సౌరభ్ గౌర్ వెల్లడించారు. అలాగే నెల్లూరు, పల్నాడు, ప్రకాశం, అనంతపురం, బాపట్ల, కర్నూల్ జిల్లాల్లో ప్రమాదకర స్థాయిలో 12 శాతం కంటే ఎక్కువ టీనేజీ ప్రెగ్నెన్సీలు నమోదవ్వడం గమనార్హం.

# ఓట్ల కోసం 'హామీల హోరా'

## మున్సిపల్ ప్రచారంలో కొత్త ట్రెండ్




- డబ్బు, మద్యం కాదు.. ఫ్రిజ్‌ల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్‌ల వరకు!
- పెళ్లిళ్లు, పుట్టుకలకూ హామీలే.. ఓటర్లను ఆశ్చర్యపరుస్తున్న వాగ్దానాలు
- బాండ్ పేపర్‌పై హామీ.. కల్లూరులో వినూత్న ప్రచారం
- ఆడబిడ్డకు ఆర్థిక భరోసా.. మున్సిపల్ ఎన్నికల్లో కొత్త కాన్సెప్ట్
- వస్తువుల పంపిణీతో ఓట్ల వేట.. హద్దు దాటిన ప్రచారం
- హామీల మేనిఫెస్టోలు.. వార్డు స్థాయిలో 'మినీ బడ్జెట్‌లు'
- వాగ్దానాల వరదలో మున్సిపల్ ఎన్నికలు.. ప్రజాస్వామ్యానికి సవాల్?

మిగతా 2 లో

న్యూస్ డెస్క్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్)

వేసవి కాలం రాకముందు నుంచే గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల వేడి కొనసాగుతోంది. హోరాహోరీగా సాగిన తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి మరికొద్ది గంటల్లో తెరపడనుంది. పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు.. ఈ ఎన్నికల ప్రచారం కోసం రాత్రి, పగలు తేడా లేకుండా తలమునకలై ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 11వ తేదీన ఎన్నికల పోలింగ్ జరగనుండగా.. చివరిసారి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు, పార్టీలు ప్రచారంలో మునిగిపోతున్నారు.

## ఢిల్లీ స్కూళ్లకు బాంబు బెదిరింపులు.. రంగంలోకి బాంబ్ స్క్వాడ్స్




2 లో

న్యూస్ డెస్క్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): దేశ రాజధానిలో వరుస బాంబు బెదిరింపులు విద్యాసంస్థలను వణికిస్తున్నాయి. తాజాగా సోమవారం ఉదయం ఢిల్లీలోని తొమ్మిది ప్రముఖ పాఠశాలలకు బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో అధికార యంత్రాంగం ఒక్కసారిగా అప్రమత్తమైంది. గత కొంతకాలంగా ప్రధాన నగరాల్లోని పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వరుస ఘటనల్లో ఇది తాజా పరిణామం.

## తరగతి గదిలో దారుణం: తోటి విద్యార్థిని కాల్చి చంపి, విద్యార్థి బలవన్మరణం



2 లో

న్యూస్ డెస్క్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తోటి విద్యార్థిని తుపాకీతో కాల్చి చంపి.. అదే తుపాకీతో మరో విద్యార్థి పాయింట్ బ్లాంక్‌లో షూట్ చేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన పంజాబ్ రాష్ట్రంలోని తార్న్‌తరణ్ జిల్లా మై భాగో లా కాలేజీలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. చనిపోయిన విద్యార్థులను ప్రిన్స్ రాజ్ సింగ్, సందీప్ కౌర్ లుగా గుర్తించారు. వీరిద్దరూ లా మొదటి సంవత్సరం చదువుతున్న క్లాస్‌మేట్స్ అని సమాచారం.

## మహానుభావులంతా పొట్టివాళ్లే కేటీఆర్

### సామ రామ్మోహన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్



2 లో

రాష్ట్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేటీఆర్ మానసిక స్థితి సరిగా లేదని, ఆయనకు తక్షణమే చికిత్స అవసరమని సంచలన వ్యాఖ్యలు చేశారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సామ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ మానసిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. ఆయన సైకలాజికల్‌గా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ సెటైర్లు వేశారు. కేటీఆర్ పిచ్చిగా వాగుతున్నారని, అందుకే ఆయనకు నేను ప్రత్యేకంగా మెడిసిన్ పంపించానని ఎద్దేవా చేశారు. కేటీఆర్ విజ్ఞత లేకుండా మాట్లాడుతున్నారని, తప్పుడు మందులు తీసుకోవడం వల్లే ఇలాంటి ప్రవర్తన ఉంటుందని వైద్యులు కూడా చెబుతున్నారని ఆయన విమర్శించారు.

బీఆర్ఎస్ అంటే 'బ్లాక్ మెయిల్ రాజకీయ సమితి'

బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు గుప్పిస్తూ.. ఆ పార్టీ పేరును 'బ్లాక్ మెయిల్ రాజకీయ సమితి'గా మార్చేశారని రామ్మోహన్ రెడ్డి ఆరోపించారు. కేటీఆర్ అహంకారం వల్ల పార్టీ పతనం ప్రారంభమైందని, బీఆర్ఎస్‌ను పూర్తిగా బొంద పెట్టేదాకా ఆయన నిద్రపోయేలా లేరని మండిపడ్డారు. రాజకీయాల్లో పిచ్చోళ్లు ఉంటే పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పడానికి కేటీఆర్ ఒక ఉదాహరణ అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

## ప్రాణదాతలకు పట్టాభిషేకం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వినూత్న పథకం




2 లో

న్యూస్ డెస్క్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఒకప్పుడు రోడ్డుపై ప్రమాదం జరిగి బాధితుడు రక్తపు మడుగులో కనిపిస్తే సాయం చేయడానికి సైతం వెనకాడే పరిస్థితి ఉండేది. 'అయ్యో పాపం' అని మనసు ద్రవిస్తున్నా, పోలీసుల విచారణలు, కోర్టుమెట్లు, సాక్ష్యాల పేరుతో ఎదురయ్యే తలనొప్పులకు భయపడి చాలామంది మౌనంగా దారిన వెళ్లిపోయేవారు. ముఖ్యంగా మహిళలు, ఉద్యోగస్తులు ఇలాంటి చిక్కుల్లో పడకూడదని భావించేవారు. ఈ ఆలస్యం కారణంగానే 'గోల్డెన్ అవర్'(ప్రమాదం జరిగిన మొదటి గంట)లో వైద్యం అందక ఎంతోమంది విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోయేవి. అయితే ఇకపై ఆ భయాలు అవసరం లేదు. మానవత్వాన్ని చాటుకునే వారిని ప్రోత్సహించేందుకు కేంద్ర సహకారంతో రాష్ట్ర రవాణా శాఖ రహవీర్ (ఆర్ఏహెచ్-వీఈఈఆర్) అనే వినూత్న పథకాన్ని అమలు చేయనుంది. 'రోడ్డు భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత' అనే సందేశంతో ఈ పథకాన్ని ప్రజలంతా తెలుసుకుని వినియోగించుకోవాలని రవాణా శాఖ విజ్ఞప్తి చేస్తున్నది.

పథకం ముఖ్య ఉద్దేశం..

రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందేలా ప్రోత్సహించడం, సాధారణ పౌరులు భయపడకుండా ముందుకొచ్చి సహాయం చేసే వాతావరణం కల్పించడం, సాయం చేసినవారికి చట్టపరమైన రక్షణ కల్పించడం ఈ రహ-వీర్ ముఖ్య ఉద్దేశం.

KR TV మన క్రాంతి ఇది వాస్తవ పత్రిక...



# మద్యం కుంభకోణం కేసు.. రాజ్ కెసిరెడ్డికి సుప్రీంకోర్టులో షాక్

న్యూస్ డెస్క్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డికి సుప్రీంకోర్టులో షాక్ తగిలింది. ఈ కేసు విచారణలో తాము జోక్యం చేసుకోలేమని సీజేఐ ధర్మాసనం స్పష్టం చేసింది. మద్యం కుంభకోణం కేసులో జోక్యం చేసుకుని తనకు బెయిల్ ఇవ్వాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో.. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కేసు విచారణ ఈ దశలో ఉన్నపుడు జోక్యం చేసుకోలేమని పేర్కొంటూ.. బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. ఈ మొత్తం వ్యవహారంలో ఎన్నికోట్లు సంపాదించారంటూ సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. కెసిరెడ్డినే కేంద్ర బిందువుగా ఉన్నారని. మొత్తం వ్యవహారానికీ ఆయనే కుట్రదారుగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కేసులో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. రూ.700 కోట్లకు పైగా కుంభకోణంలో 9 నెలలపాటు జైల్లో ఉండటం అనేది చాలా చిన్నవిషయమని, ఇది ఎక్కువకాలమేమీ కాదని వ్యాఖ్యానించింది. తాము పూర్తిస్థాయి వాదనలు వినిపించేందుకు సమయం కావాలని కెసిరెడ్డి తరపు న్యాయవాది న్యాయస్థానాన్ని కోరడంతో.. తదుపరి విచారణను సీజేఐ ధర్మాసనం 12వ తేదీకి వాయిదా వేసింది.

# ఏపీలో దారుణం.. 40రోజుల పసికందును నదిలో వదిలేసిన తల్లి

న్యూస్ డెస్క్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఏపీలో దారుణం చోటు చేసుకుంది. మానసిక సమస్యతో బాధపడుతున్న ఓ తల్లి తన 40 రోజుల పసిబిడ్డను నదిపో పడేసింది. ఈ ఘటన అనకాపల్లి జిల్లా చోడవరంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చోడవరం కోటవీధికి చెందిన లీల, బంటు శివ భార్యభర్తలు. వీరికి గతేడాది మార్చిలో వివాహం జరగ్గా డిసెంబర్ 28న లీల మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే బిడ్డ పుట్టిన తరవాత లీలకు అనారోగ్య సమస్యలు మొదలయ్యాయి. మానసికంగా సైతం అనారోగ్యానికి గురైంది. ఈ క్రమంలో ఆదివారం భర్త తన సొంత ఊరికి వెళ్లగా లీల బిడ్డను తీసుకుని అర్ధరాత్రి 12 గంటలకు ఇంటి నుండి బయటకు వెళ్లిపోయింది. విషయం తెలియడంతో వెంటనే భర్త పోలీసులకు సమాచారం అందించారు. కానీ ఆచూకీ లభించలేదు. అయితే ఉదయం భర్తకు ఫోన్ చేసిన భార్య తాను ఎక్కడ ఉన్నానో చెప్పింది. అక్కడకు చేరుకున్న భర్త బిడ్డ గురించి అడగ్గా నదిలో చేయి జారి పడిపోయాడని తెలిపింది. దీంతో భర్త పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. గతంలోనూ తన భార్య బిడ్డను ఇంట్లో వదిలేసి వెళ్లిందని భర్త పోలీసులకు తెలిపారు. ఆమెకు మానసిక అనారోగ్య సమస్య ఉన్నాట్టు చెప్పాడు.

# ఎన్డీయే ప్రభుత్వం చర్చకు భయపడుతోంది : రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి

అధికార పక్ష సభ్యులు పుస్తకాలను కోట్ చేస్తూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నా ఎవరు ఆపడం లేదని, విపక్షాలకు మాత్రం ఆ అవకాశం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ సభకు రావడానికి భయపడుతున్నారని రాహుల్ వ్యాఖ్యానించారు. విపక్ష సభ్యుల వల్ల కాకుండా, తాను చెప్పబోయే నిజాలను ఎదుర్కోలేకనే ఆయన రావడం లేదన్నారు. ప్రధానిపై దాడులు జరుగుతాయనే ప్రచారంలో వాస్తవం లేదని, ఒకవేళ ఎవరైనా అలా బెదిరిస్తే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేయాలని సవాల్ విసిరారు.

బడ్జెట్ చర్చపై ఆందోళన..

అమెరికా, భారతదేశం మధ్య కుదిరిన చరిత్రాత్మక ఒప్పందం పై రాహుల్ గాంధీ స్పందిస్తూ.. తాజా ట్రేడ్ డీల్ వల్ల రైతులపై పడే ప్రభావం గురించి చర్చ జరుగుతుందనే భయంతోనే ప్రభుత్వం బడ్జెట్‌పై చర్చను అడ్డుకోవాలని చూస్తోందని ఆయన విమర్శించారు. తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, కానీ ప్రభుత్వం వెనకాడుతోందని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా మీడియాతో చెప్పుకొచ్చారు. అంతకు ముందు రాహుల్ గాంధీ సభలో మాట్లాడుతుండగా.. బీజేపీ, ఎన్డీయే కూటమి నేతలు పెద్ద ఎత్తున నిరసన చేసి.. రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడటంతో స్పీకర్ సభను వాయిదా వేస్తారు.

# ఓట్ల కోసం 'హామీల హోరా'.. మున్సిపల్ ప్రచారంలో కొత్త ట్రెండ్

మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలోనే ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు రకరకాల హామీలు ఇస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓట్ల కోసం కొత్త కొత్త హామీల వర్షం కురిపిస్తూ ఓటర్లనే ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు.

సాధారణంగా ఎన్నికలు ఉన్నాయంటే చాలు.. మద్యం, డబ్బు, బిర్యానీ, చికెన్, మటన్.. ఇంటింటికీ తిరిగి పంచేవారు. కానీ ఈ మున్సిపల్ ఎన్నికల్లో మాత్రం అది కాస్తా హద్దు దాటింది. ఇళ్లల్లోకి కావాల్సిన ఖరీదైన వస్తువులను ఇచ్చేస్తున్నారు. టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, మిక్సీలు, రైస్ కుక్కర్లు, ప్రెజర్ కుక్కర్లు, డిన్నర్ సెట్‌లు, కూలర్లు.. ఇలా ఒక్కటేంటీ రకరకాల వస్తువులను పంచుతున్నారు.

వీటితోపాటు తమ వార్డు పరిధిలో ఉన్న వారి ఇళ్లల్లో ఆడపిల్లల పెళ్లిళ్లు జరిగితే వారికి ఆర్థిక సాయం అందిస్తామని హామీలు కురిపిస్తున్నారు. అంతేకాకుండా పుట్టే ఆడబిడ్డల పేరు మీద కూడా డబ్బులు ఇస్తామని పేర్కొంటున్నారు. ఇంకా కొందరు బాండ్ పేపర్ల మీద హామీలు రాసిస్తుండగా.. మరికొందరు ఓటర్ల నుంచి ప్రమాణాలు తీసుకుంటున్నారు.

కల్లూరులో బాండ్ పేపర్‌పై ప్రమాణ పత్రం

ఖమ్మం జిల్లా కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో ఉన్న వేము విజయలక్ష్మి.. రూ.100 బాండ్ పేపర్‌పై తాను అమలు చేయనున్న వాగ్దానాలు రాసి ఇచ్చారు. తన సొంత డబ్బులతో తన వార్డు ప్రజలకు చేసే పనులకు సంబంధించిన వివరాలను బాండ్ పేపర్‌పై రాసి ప్రచారం చేశారు.

తన వార్డు పరిధిలో ఎవరికైనా ఇందిరమ్మ ఇల్లు మంజూరైతే.. ఒక్కొక్కరికీ 20 సిమెంట్ బస్తాలను ఫ్రీగా ఇస్తానని పేర్కొన్నారు. అంతేకాకుండా తన వార్డులో నివసించే నిరుపేద ఆడబిడ్డల పెళ్లికి రూ.5,116 సాయం చేస్తానని చెప్పారు. నిరుపేదలకు పుట్టే ప్రతీ ఆడబిడ్డకు ఒక్కొక్కరికీ రూ.5116 చొప్పున అందిస్తానని వెల్లడించారు.

ములుగులో ఆడబిడ్డ పెళ్లికి రూ.10వేల సాయం

ములుగు జిల్లాలోని ములుగు మున్సిపాలిటీ 1వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ తరఫున నేషనల్ జిమ్నాస్టిక్స్ ప్లేయర్ అంగోతు శిరీష బరిలో నిలిచారు. డిగ్రీ వరకు చదివిన అంగోతు శిరీష.. 2014లో పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జరిగిన 60వ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో పాల్గొని జిమ్నాస్టిక్స్‌లో సత్తా చాటారు.

పటియాల, కురుక్షేత్రలో జరిగిన నేషనల్ లెవల్ జమ్నాస్టిక్స్ పోటీల్లోనూ రాణించి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ప్రస్తుతం ఆమె ములుగులో ట్రైనింగ్ ఇస్తున్నారు. ఈ పురపాలక సంఘం ఎన్నికల్లో తనను గెలిపిస్తే తాను పోటీ చేసే వార్డులో పెళ్లి చేసుకునే ప్రతి యువతికి రూ.10 వేల చొప్పున అందిస్తానని హామీ ఇచ్చారు. ఇక ఆడపిల్ల పుడితే వారి పేరు మీద రూ.5 వేలు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని వాగ్దానం చేశారు.

ఆందోలు-జోగిపేటలో తాళిబొట్టు, మెట్టెలు

సంగారెడ్డి జిల్లా ఆందోలు-జోగిపేట మున్సిపాలిటీలో 10వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీచేస్తున్న చౌదిగారి విజయలక్ష్మి తన భర్త నర్సింహులు, కుమారుడు సాయికుమార్‌తో కలిసి మేనిఫెస్టోను విడుదల చేశారు. తనను 10వ వార్డు కౌన్సిలర్‌గా గెలిపిస్తే.. యువతుల పెళ్లిళ్లకు పుస్తె, మెట్టెలు కానుకగా ఇస్తానని పేర్కొన్నారు.

తన వార్డులోని ప్రజలు ఎవరైనా చనిపోతే వారి అంత్యక్రియల ఖర్చుల కింద రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారు. పుట్టిన ప్రతి బిడ్డకు సీఎస్‌కే కిట్ ఇస్తామని వెల్లడించారు. వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు స్పెషల్ అకౌంట్‌లో రూ.10 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని చెప్పారు. ఈ నిధులు దుర్వినియోగం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

# మాతృత్వానికి మరణం.. ప్రేమకు భాష లేదు!

న్యూస్ డెస్క్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): అమ్మ ప్రేమ.. అది మనిషికైనా, మూగజీవానికైనా ఒకటే అని నిరూపించే హృదయవిదారక దృశ్యం నిజామాబాద్ జిల్లాలో వెలుగుచూసింది. తన కళ్లముందే ప్రాణాలు కోల్పోయిన బిడ్డను దూరం చేయవద్దంటూ ఒక తల్లి ఆవు చేసిన ఆక్రందన స్థానికులను కన్నీరు పెట్టించింది. వివరాల్లోకి వెళితే.. నాగేపూర్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో ఓ ఆవు దూడ మృతి చెందింది. గ్రామస్థులు ఆ దూడ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ట్రాక్టర్‌లో వేసి తీసుకెళ్తుండగా, ఆ తల్లి ఆవు తట్టుకోలేకపోయింది. ట్రాక్టర్‌లో ఉన్న తన బిడ్డను చూస్తూ ఆ ఆవు కన్నీరుమున్నీరుగా విలపించింది. ట్రాక్టర్ కదులుతుంటే.. తన బిడ్డను ఎక్కడ తీసుకెళ్లిపోతారో అన్న ఆందోళనతో ఆ వాహనం వెనకాలే కిలో మీటర్ల మేర పరుగెత్తింది. అంబా అంటూ అది పెట్టిన కేకలు, ఆ తల్లి ఆవేదన చూసి దారి వెంట వెళ్లే వారు సైతం ఆగిపోయి కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియో చూసిన నెటిజెన్లు 'భాష లేకపోయినా భావం ఒకటే.. మాతృత్వానికి మరణం లేదు' అంటూ కామెంట్ చేస్తున్నారు.

# 9 స్కూళ్లకు బాంబు బెదిరింపులు.. రంగంలోకి బాంబ్ స్క్వాడ్స్

న్యూస్ డెస్క్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): దేశ రాజధానిలో వరుస బాంబు బెదిరింపులు విద్యాసంస్థలను వణికిస్తున్నాయి. తాజాగా సోమవారం ఉదయం ఢిల్లీలోని తొమ్మిది ప్రముఖ పాఠశాలలకు బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో అధికార యంత్రాంగం ఒక్కసారిగా అప్రమత్తమైంది. గత కొంతకాలంగా ప్రధాన నగరాల్లోని పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వరుస ఘటనల్లో ఇది తాజా పరిణామం. ఉదయం సుమారు 8:30 నుండి 9:00 గంటల మధ్య వివిధ జిల్లాల్లోని పాఠశాలలకు ఈ బెదిరింపులు రావడంతో యాజమాన్యాలు అప్రమత్తమయ్యాయి. వెంటనే పోలీసులకు సమాచారమివ్వగా.. ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగారు. అగ్నిమాపక దళం, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లను యుద్ధ ప్రాతిపదికన ఆయా పాఠశాలలకు తరలించారు. ముందస్తు జాగ్రత్తగా పాఠశాలల్లోని విద్యార్థులను, సిబ్బందిని వెంటనే బయటకు పంపించి స్కూళ్లను ఖాళీ చేయించారు. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో బాంబు స్క్వాడ్ సభ్యులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ బెదిరింపులు కేవలం పుకార్లేనా లేక దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వరుసగా పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని వస్తున్న ఈ కాల్స్‌తో అటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఇటు విద్యాసంస్థల నిర్వాహకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఏపీలో ప్రమాదకర స్థాయిలో టీనేజీ ప్రెగ్నెన్సీలు.. దీనివల్ల నష్టాలేంటి?

మొదటి పేజీ తరువాయి

ఏలూరు అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, సత్యసాయి, నంద్యాల జిల్లాల్లో 10-12 శాతం వరకూ టీనేజీ ప్రెగ్నెన్సీలు నమోదయ్యాయి. అల్లూరి, తూర్పు గోదావరి, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో 8-10 శాతం ప్రెగ్నెన్సీలు నమోదయ్యాయి. ఒక్క విశాఖలో మాత్రం అత్యల్పంగా 3.98 శాతం టీనేజీ ప్రగ్నన్సీలు రికార్డవ్వగా.. మరో 9 జిల్లాల్లో మాదిరిగా టీనేజీ యువతులు గర్భాలు దాల్చినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. దీంతో 2026-27లో కొత్త టార్గెట్ పెట్టుకుంది. కొత్త ఆర్థిక సంవత్సరంలో టీనేజీ ప్రెగ్నెన్సీలు 5 శాతానికి మించకూడదని భావిస్తోంది. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని, యువతకు టీనేజీ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించే బాధ్యతలను ఆశావర్కర్లకు అప్పగించే యోచనలో ఉన్నట్లు సమాచారం.

టీనేజీ ప్రెగ్నెన్సీ వల్ల వచ్చే సమస్యలేంటి ?

టీనేజ్ లో ప్రెగ్నెంట్ అయితే సుఖ ప్రసవం అవుతుందని, తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని అనుకుంటారు కానీ.. అది అస్సలు యువతులకు మంచిది కాదంటున్నారు వైద్యులు.

16 ఏళ్ల వయసులో తల్లులైతే కాన్పు సమయంలో తల్లులు మరణించే (మెటర్నల్ మోర్టాలిటీ) అవకాశం ఉందంటున్నారు.

బిడ్డలు నెలలు నిండకముందు పుట్టే ఛాన్స్ ఎక్కువ. కడుపులోనే బిడ్డ చనిపోయే ప్రమాదం ఉంది.

పుట్టిన పిల్లలు బరువు తక్కువగా ఉండటం. తీవ్రస్థాయిలో రక్తపోటు, పుట్టిన పిల్లలు సరిగ్గా ఊపిరి పీల్చుకోలేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

# ప్రాణదాతలకు పట్టాభిషేకం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వినూత్న పథకం

మొదటి పేజీ తరువాయి

దీని ద్వారా ప్రమాద బాధితుడి ప్రాణాలను కాపాడిన ప్రతి వ్యక్తికి రూ.25వేల నగదు బహుమతి, ప్రభుత్వ ప్రశంసాపత్రం అందిస్తారు. జిల్లా కమిటీ ఏర్పాటు వివరాలు, ఎంపిక విధానంతోపాటు ఈ పథకానికి విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశామని రవాణా శాఖ పేర్కొన్నది.

ఎలా ఎంపిక చేస్తారు?..

రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడికి తగిన సహాయం చేసి ఆస్పత్రి తరలించిన వ్యక్తి వివరాలు సంబంధిత పోలీసు అధికారి, ఆస్పత్రి సిబ్బంది ద్వారా నమోదు చేస్తారు. పోలీస్ అధికారి జిల్లా కమిటీకి సిఫార్స్ చేయాలి. జిల్లాస్థాయి కమిటీలో కలెక్టర్ చైర్మన్, ఎస్పీ, జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్లు మెంబర్లుగా, జిల్లా రవాణా శాఖ అధికారి కన్వీనర్‌గా ఉంటారు. జిల్లా కమిటీ ఆమోదం పొందిన అనంతరం అర్హులైన వ్యక్తులను రహ-వీర్‌గా ఎంపిక చేస్తారు. వివరాలను జిల్లా కమిటీ రవాణా కమిషనర్‌కు పంపిస్తారు. ఎంపికైన వారికి రూ.25వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం రవాణా శాఖ ద్వారా అందిస్తారు.

చట్టపరమైన రక్షణ..

సహాయం చేసిన వ్యక్తిని పోలీసు విచారణలు లేదా కోర్టు ప్రక్రియల పేరుతో వేధించరాదని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్యసాయం అందించాల్సి ఉంటుంది. పూర్తి చట్టపరమైన రక్షణ ఉంటుందని సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు సైతం స్పష్టం చేస్తున్నాయి. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు చూస్తూ ఉండకుండా, భయపడకుండా ముందుకొచ్చి సహాయం చేయాలని రవాణాశాఖ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది. అలా చేసినవారికి ప్రభుత్వం పూర్తి రక్షణతో పాటు గౌరవం కల్పిస్తుందని పేర్కొన్నది.

# తరగతి గదిలో దారుణం: తోటి విద్యార్థిని కాల్చి చంపి, విద్యార్థి బలవన్మరణం



అయితే, కాల్పులకు సంబంధించిన దృశ్యాలు క్లాస్ రూంలో ఉన్న సీసీటీవీ కెమెరాలో స్పష్టంగా రికార్డ్ అయ్యాయి. ప్రస్తుతం ఆ వీడియోలు సోషల్ మీడియాలోనూ వైరల్ అవుతున్నాయి.

కాగా, క్లాస్ జరుగుతుండగానే ప్రిన్స్ రాజ్‌సింగ్ తన వెంట తెచ్చుకున్న తుపాకీతో తోటి విద్యార్థిని సందీప్ కౌర్‌పై కాల్పులు జరిపాడు. అనంతరం సందీప్ కౌర్ తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆ తర్వాత నిందితుడు ప్రిన్స్ రాజ్‌సింగ్ అదే తుపాకీతో పాయింట్ బ్లాంక్ రేంజ్ లో కాల్చుకుని ప్రాణాలు తీసుకున్నాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అసలు ఆ విద్యార్థుల మధ్య ఉన్న వివాదం ఏంటి? ప్రేమ వ్యవహారమా.. మైనర్ అయిన విద్యార్థికి తుపాకీ ఎక్కడి నుంచి వచ్చింది..? అన్న కోణంలో విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనతో కళాశాలలోని విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు లోనవుతున్నారు.

# తెలంగాణలో మద్యం దుకాణాలు బంద్

న్యూస్ డెస్క్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అన్ని మున్సిపాలిటీలలో 9వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి 11వ తేదీ వరకు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. అదేవిధంగా ఫలితాల నేపథ్యంలో 13వ తేదీన కూడా వైన్స్, బార్లు బంద్ ఉండనున్నారు. ఈ ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే.. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండడంతో ఆయా మునిసిపాలిటీలలో ప్రచారం ఊపందుకుంది. ప్రచారానికి రేపు ఒక్క మాత్రమే గడువు ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. కరపత్రాలు తయారు చేసుకొని ఇంటింటికీ తిరుగుతూ ఓటు వేయాల్సిందిగా ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కొందరు అభ్యర్థులైతే ఏకంగా ఓటర్ల కాళ్లకు మొక్కుతూ వేయాలని వేడుకుంటున్నారు. ఒకసారి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# చెప్పిన డేట్‌కే నక్సలిజాన్ని అంతం చేస్తాం: అమిత్ షా

న్యూస్ డెస్క్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఛత్తీస్‌గఢ్ రాయ్‌పుర్‌లో పర్యటించారు. మార్చి 31 నాటికి నక్సలిజాన్ని తుడిచిపెడతామమని అమిత్ షా ప్రకటించిన డెడ్‌లైన్ ముగుస్తుండటంతో.. ఆదివారం అధికారులో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలపై సుదీర్ఘంగా చర్చించారు. కగార్ ఆపరేషన్ చర్యలు సత్ఫలితాలిచ్చాయని అమిత్ షా అధికారులను ప్రశంసించారు. మార్చి 31లోపు నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని ఈ సందర్భంగా అమిత్ షా మరోసారి పునరుద్ఘాటించారు. ఈ ప్రాంతంలో మావోయిస్టుల నిధులను అడ్డుకోవడం, లొంగుబాటు చర్యలు, భద్రతా దళాల ఆపరేషన్స్, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలు మావోయిస్టుల ప్రభావాన్ని గణనీయంగా తగ్గించాయన్నారు. ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి, డీసీఎం విజయ్ శర్మ, కేంద్ర హోంశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఛత్తీస్‌గఢ్ పోలీసుల వివరాల ప్రకారం.. ఈ ప్రాంతంలో 2024 నుంచి 500 మందికిపైగా మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అగ్రనేత నంబాల కేశవరావు కూడా ఉన్నారు. ఈ రెండేళ్ల కాలంలో వందల సంఖ్యలో అరెస్టయ్యారు. 2,500 మందికిపైగా లొంగిపోయారు.

# ఎచ్డీఎఫ్సీ బ్యాంక్ ఉద్యోగి వీరంగం.. కస్టమర్‌పై కుల వివక్ష వ్యాఖ్యలు

న్యూస్ డెస్క్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దేశ వాప్తంగా కుల పిచ్చి రోజురోజుకూ ముదురుతోంది. తాజాగా, ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్ లో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఓ మహిళా ఉద్యోగి కస్టమర్‌పై బూతు పురాణం విప్పింది. అంతటితో ఆగకుండా కుల వివక్షతో కూడిన వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ప్రస్తుతం అందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు సదరు ఉద్యోగిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అసలు జరిగింది ఇదే..

వివరాల్లోకి వెళితే.. వీడియో ప్రకారం ఆస్తా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉద్యోగి ఒక ఖాతాదారుడితో తీవ్ర వాగ్వాదానికి దిగింది. ఏదో ఫిర్యాదు విషయంలో మొదలైన గొడవ ముదిరి అత్యంత అసభ్యకరంగా ప్రవర్తించే వరకు వెళ్లింది. సదరు ఉద్యోగి గట్టిగా అరుస్తూ.. 'నేను ఠాకూర్‌ని, నాతో పెట్టుకోవద్దు' అంటూ తన కులాన్ని ప్రస్తావిస్తూ కస్టమర్‌ను బెదిరించింది. ఆ వెంటనే తన డెస్క్‌పై ఉన్న లాప్‌టాప్‌ను ఎత్తి కస్టమర్‌పైకి విసరబోయింది. 'నిన్ను నాశనం చేస్తా' అంటూ తీవ్ర స్థాయిలో హెచ్చరించింది. దీంతో అక్కడ ఉన్న ఇతర బ్యాంక్ సిబ్బంది ఆమెను అడ్డుకోవడానికి, శాంతింపజేయడానికి ప్రయత్నించినప్పటికీ ఆమె ఏమాత్రం తగ్గకుండా అరుస్తూనే ఉంది. ఈ వీడియో నెట్టింట వైరల్ అవ్వడంతో బ్యాంకింగ్ రంగంలో ఉండాల్సిన కనీస మర్యాద కూడా లేదంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. ఓ ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగి ఇలా కులం పేరుతో దూషించడం, భౌతిక దాడికి దిగడం క్షమించరాని నేరమని, ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ ఘటనపై ఆ ప్రముఖ ప్రైవేటు బ్యాంక్ ప్రతినిధులు స్పందించాల్సి ఉంది.

# ప్రచారంలో ప్రమాదం.. బాంబు పేలి కార్యకర్తకు తీవ్ర గాయాలు



న్యూస్ డెస్క్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): నిప్పుతో చెలగాటం ఆడొద్దని ఊరికే చెప్పలేదు పెద్దలు. తాజాగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రచారం విషాదాన్ని నింపింది. బాంబు షాట్స్ కాలుస్తుండగా జరిగిన పేలుడులో ఓ పార్టీ యువ కార్యకర్త తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. సుల్తానాబాద్‌లో రాజకీయ పార్టీలు హోరెత్తించే ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే తమ నాయకుడికి స్వాగతం పలుకుతూ కొందరు కార్యకర్తలు బాణసంచా కాల్చడం మొదలుపెట్టారు.

సాధారణంగా నేలపై పెట్టి నిప్పంటించిన 'బాంబు షాట్స్'ను ఓ యువ కార్యకర్త అత్యుత్సాహంతో తన చేతిలో తీసుకున్నాడు. ఇదే సమయంలో అనుకోని విధంగా ఆ బాంబు షాట్ గాలిలోకి వెళ్లకుండా చేతిలోనే ఒక్కసారిగా బ్లాస్ట్ పేలిపోయింది. ఆ పేలుడు ధాటికి కార్యకర్త అరచేయి, వేళ్లు తీవ్రంగా ఛిద్రమయ్యాయి. చుట్టుపక్కల ఉన్న వారు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న బాధితుడిని గమనించిన తోటి కార్యకర్తలు, స్థానికులు వెంటనే అతనిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రధాన ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

# మహానుభావులంతా పొట్టివాళ్లే కేటీఆర్.. సామ రామ్మోహన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్

మొదటి పేజీ తరువాయి



టీఆర్ తన చుట్టూ ఉన్న నాయకుల ఎత్తు గురించి చేసిన వ్యాఖ్యలపై రామ్మోహన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. హిందూ ధర్మ స్థాపన చేసి చరిత్ర సృష్టించిన ఛత్రపతి శివాజీ మహారాజ్, ప్రణబ్ ముఖర్జీ, పీవీ నరసింహారావు వంటి మహానుభావులు కూడా పొట్టివారేనని అన్నారు. కనీసం తన తల్లి శోభమ్మ, పార్టీ నేత జగదీశ్ రెడ్డి కూడా అలాగే ఉంటారనే విషయాన్ని కేటీఆర్ మర్చిపోకూడదని హితవు పలికారు.

క్షేత్రస్థాయిలో ప్రజల తిరుగుబాటు

గజ్వేల్, సిరిసిల్ల నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నేతలకు చుక్కెదురవుతోందని సామ రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు తరిమి ఉంటే తట్టుకోలేక హరీష్ రావు మల్లన్నసాగర్‌లో మునిగి మంచిర్యాలలో తేలారు. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్లలో కేటీఆర్ ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. కోర్టు పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్ ఆధారాలను ప్రభుత్వం తగలబెట్టించిందని కేటీఆర్ చేసిన ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. అబద్ధపు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని, కారుకు ఓటేయకపోతే కళు పోతాయని ప్రజలను శపించడం కేటీఆర్ బుర్రలేనితనానికి నిదర్శనమని సామ రామ్మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు.

# అధికార, ప్రతిపక్షాలకు చెక్

### నాయకురాలిగా కాదు.. వార్డు బిడ్డగా వచ్చా”

### - స్వతంత్ర అభ్యర్థి అనురాధ ధీమా



మోత్కూర్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ ఐదవ వార్డులో ఈసారి ఎన్నికలు భిన్నంగా మారుతున్నాయి. అధికార పార్టీ, ప్రతిపక్షాల హామీలకు విసిగిపోయిన ప్రజలు స్వతంత్ర అభ్యర్థి అనురాధ వైపు చూస్తున్నారు. వార్డు సమస్యలను పట్టించుకోని పాలకుల నిర్లక్ష్యానికి నిరసనగా ప్రజలు స్వతంత్ర పోరాటానికి మద్దతు పలుకుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు ఐదవ వార్డులో మౌలిక వసతుల పేరుతో జరిగిన పనులు కాగితాలకే పరిమితమయ్యాయని, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాల సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారం కాని వాస్తవాలను అనురాధ ప్రజల ముందుంచుతున్నారు. పార్టీ గుర్తుల వెనుక దాక్కుని ప్రజలను మోసం చేసిన వారికే వార్డు అప్పగించాలా అంటూ ఆమె ఘాటుగా ప్రశ్నిస్తున్నారు. ఇంటింటి ప్రచారంలో అనురాధకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. నాయకుడిగా కాదు, వార్డు బిడ్డగా వచ్చాను. సమస్యల పరిష్కారమే నా అజెండా” అని ఆమె స్పష్టం చేస్తున్నారు. పార్టీ ఆదేశాలకు కాకుండా ప్రజల ఆవేదనకే తన ఓటు ఉంటుందని హామీ ఇస్తున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానన్న అనురాధ ధీమా, నిజాయితీ వార్డులో కొత్త రాజకీయ చర్చకు తెరలేపింది. ఈ ఎన్నికల్లో పార్టీ రాజకీయాలకు చెక్ పెట్టి, స్వతంత్ర స్వరం గెలుస్తుందా అనే ఆసక్తి ఇప్పుడు మోత్కూర్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

# మోత్కూరు 11వ వార్డులో హోరెత్తిన ఎన్నికల ప్రచారం

### పసల మరియన్నకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు



మోత్కూర్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మోత్కూరు మున్సిపాలిటీ 11వ వార్డులో ఎన్నికల సందడి నెలకొంది. బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు పసల మరియన్న - పసల విజయ మద్దతుగా సోమవారం వార్డులో విస్తృత ప్రచారం నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ గులాబీ జెండాలతో వార్డును హోరెత్తించారు. ఈ సందర్భంగా పసల మరియన్న మాట్లాడుతూ, వార్డు సమగ్ర అభివృద్ధికి తమను గెలిపించాలని కోరారు గతంలోనూ తాము ప్రజల మధ్యే ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేశామని, అదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని తెలిపారు.వార్డులో డ్రైనేజీ సమస్యలు, సిసి రోడ్ల నిర్మాణం మరియు తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరాయని, ఆ నమ్మకంతోనే ప్రజలు తమను ఆశీర్వదిస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. “వార్డు ప్రజల కష్టసుఖాల్లో తోడుండే వ్యక్తులుగా మాకు ఒక అవకాశం ఇవ్వండి. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా 11వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతాం.” అని మరియన్న ఉద్ఘాటించారు.

# వికారాబాద్ 24వ వార్డులో బీజేపీ అభ్యర్థి రుచిత రెడ్డి ప్రచార హోరు



వికారాబాద్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): వికారాబాద్ జిల్లా 24వ వార్డు మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి పార్టీ తరఫున శ్రీమతి రుచిత రెడ్డి వైఫ్ ఆఫ్ సాయిచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం భాగంలో పాల్గొనడం జరిగింది తాను కేంద్రం నుంచి అత్యధిక నిధులు తెచ్చి వార్డుకు మంచి వీధి దీపాలు లైట్లు డ్రైనేజీ వ్యవస్థ మెరుగు కాలువలు ప్రతిదీ కొత్తగా తమ వీధిని తయారు చేస్తానని ప్రజలకు యువకులకు పార్టీ పెద్దలకు తెలియజేయడం జరిగింది బిజెపి పార్టీ తన పైన నమ్మకాన్ని ఉంచి తన టికెట్ ఇచ్చినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ నా ప్రచారంలో భాగంగా పాల్గొంటున్నా ప్రతి యువకునికి అక్క అమ్మ చెల్లెళ్లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ వాళ్లకు రుణపడి ఉంటానని రుచిత సాయి చరణ్ రెడ్డి తెలియజేయడం జరిగింది తనకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఆశించారు

# మున్సిపల్ కార్పొరేషన్ లక్ష్యం.. భారీ మెజార్టీతో గెలుస్తాం



వికారాబాద్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): వికారాబాద్ జిల్లా ఆలంపల్లి గ్రామం దగ్గర ఎస్సీ రిజర్వుడు శివప్రసాద్ సప్న అభ్యర్థిగా పోటీ చేయడం జరుగుతుంది కాబట్టి ఇక్కడ మైనార్టీ జనాభా ఉండడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం మరియు బీజేపీలు రెండు కుత్తులు పొంది తన గెలవకుండా చాలా ఇబ్బంది గురి చేస్తున్న అని ఆ విధంగా చేశారు ఎలాగైనా ఈ మున్సిపల్ కార్పొరేషన్ లో గెలిచి తన సత్తా చాటుకుంటానని ఈ కార్యక్రమంలో శివప్రసాద్ మరియు స్వప్న తెలిపారు ప్రజలు తమ పైన ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి మంచి భారీ మెజార్టీతో గెలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 25వ వార్డు నుంచి ప్రజల గుండెల్లో దేవమ్మ

25వ వార్డు అంటే అభివృద్ధి, నిజాయితీ, సేవ-ఈ మూడు మాటలకు ప్రతిరూపం దేవమ్మ. ఏ పార్టీ జెండా కాదు, ఏ స్వార్థ రాజకీయాలు కాదు... కేవలం ప్రజల కష్టాలే ఆమె అజెండా. అందుకే దేవమ్మ ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగింది. ఇన్నాళ్లు వార్డులో నీటి సమస్యలైనా, డ్రైనేజీ సమస్యలైనా, పేదల అవసరాలైనా-ఎక్కడ సమస్య ఉంటే అక్కడ దేవమ్మ ఉండేది. పదవి కోసం కాదు, సేవ కోసం ముందుకు వచ్చిన ధైర్యవంతురాలు ఆమె. ప్రజల ఆశీర్వాదమే ఆమె బలం. ప్రజల నమ్మకమే ఆమె విజయం. పార్టీ కాదు - ప్రజలే దేవమ్మ పార్టీ. హామీలు కాదు - పనులే దేవమ్మ మాట. 25వ వార్డు అభివృద్ధి కోసం, నిజాయితీ గల నాయకత్వం కోసం ఇండిపెండెంట్ దేవమ్మకు మీ అమూల్యమైన ఆశీర్వాదం.

# గజ్వేల్ 14వ వార్డులో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



సిద్ధిపేట, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలలో భాగంగా సిద్ధిపేట జిల్లాలోని గజ్వేల్ మున్సిపల్ 14వ వార్డ్ లో సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తుంకుంట ఆంక్షరెడ్డి గారితో కలిసి ఇంటి ఇంటి ప్రచారం చేసిన మున్సిపల్ ఎన్నికల మీడియా కమిటీ మెంబెర్, టీపీసీసీ ప్రచారా కమిటీ కో- ఆర్డినేటర్ రేగులపాటి రమ్యారావు గారు.

# జాతీయ సేవ పథకం

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం విజయవంతం




మహబూబాబాద్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఎన్ ఎస్ ఎస్ యూనిట్ - 1 ప్రోగ్రాం అధికారి డా.డి.రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా నాలుగవ రోజు కంబాలపల్లి గ్రామపంచాయతీలో రక్తదాన శిబిరం డా. హితేష్ కుమార్ మరియు వారి సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇందులో 29 మంది ఎన్ఎస్ఎస్ వాలంటరీ మరియు నేత్ర స్వచ్ఛంద సంస్థ సభ్యులు రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. లక్ష్మణ్ నాయక్, డాక్టర్ సిహెచ్ శ్రీనివాసులు, రఘురాం, కంబాలపల్లి గ్రామ సర్పంచ్ చీరిక వసంతా ఉపేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ కమటం యాకన్న, మయూరి పంచాయతీ సెక్రెటరీ, మాజీ ఉపసర్పంచ్ చీరిక వేణు రెడ్డి పాల్గొన్నారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా అశోక్ మరియు వారి బృందం, టిబి హాస్పిటల్ మహబూబాబాద్ ఆధ్వర్యంలో టిబి వ్యాధిపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 ప్రోగ్రాం ఆఫీసర్ ఏ. అన్నపూర్ణ, అధ్యాపకులు డా. సుమలత, డా. ఉపేందర్, నరేష్, వీరు, రవితేజ, యాకన్న మరియు వలంటీర్స్ పాల్గొన్నారు.



# రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో గోడపత్రిక ఆవిష్కరణ చిర్ర యాకయ్య




నర్సింహులపేట, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మండలం లోని పడమటిగూడెం గ్రామంలో అఖిల భారత రైతు కూలీ సంఘం.ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించిన అఖిల.భరత.రైకూలీసంఘం తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు చిర్ర యాకన్న అనంతరం ఆయన సోమవారం విలేకరుల సమావేశంలోమాట్లాడుతూ, నేటి బీజేపీ ప్రభుత్వం దేశంలో కార్మికులు, రైతు కూలీలను హక్కులేని బానిసలుగా మార్చే దిశగా వ్యవస్థబద్ధమైన దాడి చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. కార్మిక చట్టాల పేరుతో తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లు కార్మికుల కనీస హక్కులను కాలరాస్తూ, యాజమాన్యాలకు అపరిమిత అధికారాలు కట్టబెట్టే ప్రమాదకర చట్టాలని తెలిపారు. పని గంటలు పెంచడం, సమ్మె హక్కును హరించడం, సంఘటితంగా పోరాడే అవకాశాలను అణిచివేయడం ఈ చట్టాల అసలైన లక్ష్యమని స్పష్టం చేశారు. అలాగే బి.జి. రాంజీ పేరును మార్చి నిధులకు కోత విధించడం అనేది రైతు కూలీల సంక్షేమాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రజలను మభ్యపెట్టే రాజకీయ మాయాజాలమని విమర్శించారు. పేర్లు మార్చడం కాదు, పథకాలను పాత పద్ధతిలో యథావిధిగా, పూర్తి నిధులతో అమలు చేయడమే ప్రజల డిమాండ్ అని అన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే విధానాలకు వ్యతిరేకంగా, కార్మిక.రైతు వర్గాల ఐక్య పోరాటం తప్ప మరో మార్గం లేదని, అందులో భాగంగానే ఈ నెల 12వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మె అని చెప్పారు. ఈ సమ్మె కేవలం ఒకరోజు నిరసన కాదు, ప్రజల జీవన హక్కుల కోసం జరుగుతున్న పోరాటానికి నాంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్ము కుమార్, చిర్రా హనుమంతు, అనిల్, అమృత, యాకయ్య, మల్లయ్య, లింగమ్మ, మంచాల కొమురయ్య, ఎర్ర అశోక్, కాశి రెడ్డి, రామి రెడ్డి, జక్కుల యక సాయిలు తదితరులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని చేశారు.

# తెలంగాణలో సర్పంచ్‌లకు కొత్త అధికారాలు

### అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యత సర్పంచ్‌లకు

### అక్రమాలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం



డోర్నకల్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తెలంగాణలోని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అధికారాలు అప్పగించింది. ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను పూర్తిగా సర్పంచ్‌లే చూసుకోనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పౌష్టికాహారం పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టి, అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో రెండేళ్లపాటు గ్రామాల్లో ఎన్నికైన పాలకవర్గాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ పూర్తిగా గాడితప్పింది. చాలాచోట్ల పౌష్టికాహారం పక్కదారి పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఇటీవలే కొలువుదీరిన కొత్త పంచాయతీ పాలకవర్గాలకు ఈ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సర్పంచ్‌ల నేతృత్వంలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనుంది. ఈ కమిటీకి సర్పంచ్ ఛైర్మన్‌గా వ్యవహరించనుండగా, మొత్తం 11 మంది సభ్యులు ఉంటారు. అంగన్‌వాడీ టీచర్ కన్వీనర్‌గా, ఏఎన్ఎం, స్కూల్ సైన్స్ టీచర్, ఒక రిటైర్డ్ ఉద్యోగి, చిన్నారుల తల్లులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ప్రతి నెలా కేంద్రాలకు అందుతున్న బియ్యం, పప్పు, బాలామృతం, గుడ్లు, పాలు వంటి సరుకుల నాణ్యతను, పంపిణీని తనిఖీ చేస్తుంది. ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న భోజనాన్ని కూడా పరిశీలిస్తుంది. లక్షల రూపాయల విలువైన పోషకాహారం లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడటమే ఈ కమిటీ ప్రధాన విధి.

# 1 వ వార్డు కౌన్సిలర్ గా భూసాని.జయమ్మ ఉప్పలయ్య ని గెలిపించండి. అభివృద్ధి చేసి చూపిస్తా



తొర్రూరు, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మండల కేంద్రంలోని మున్సిపాలిటీ పరిధిలో నీ 1వ వార్డు బి.ఆర్. ఎస్ అభ్యర్థి గా భూసాని జయమ్మ ఉప్పలయ్య నీ గెలిపించండి,సేవ చేసే అవకాశం కలిపించండి అని వారు కోరుతూ 1వ వార్డు లో అనేక రకాల సమస్యలు ఉన్నాయి డ్రైనేజీ, అర్హులైన వారికి ఇళ్లు, వితంతువుల కి వృద్ధులకి పెన్షన్ లు , ప్రభుత్వం తో పోరాడి అయిన అన్ని సంక్షేమ పథకాలను ఈ వార్డు ప్రజలకి అందేలా చేస్తా కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ తో గెలిపించాలని వారు కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో భూసాని,రమేష్,విజయ్, శ్రీనివాస్, మురళి బి. ఆర్. ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారూ.

# రూ. 24 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఏఈ



ఏపీ న్యూస్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మండలంలోని చేపట్టిన పనుల తాలుకూ బిల్లుల చెల్లింపునకు లంచం డిమాండ్ చేసిన ఏఈని అవినీతి నిరోధక శాఖ పట్టుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ గా పనిచేస్తున్న సత్యనారాయణ సోమవారం రూ. 24 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు చిక్కాడు.

ఇటీవల చేపట్టిన నిర్మాణ పనులకు చెల్లించాల్సిన బిల్లుల కోసం ఏఈని కాంట్రాక్టర్ కలువగా లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో సోమవారం వ్యూహం ప్రకారం కార్యాలయంలో రూ.24 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలకు వ్యతిరేకంగా లంచాలు డిమాండ్ చేస్తే ఏసీబీకి ఫిర్యాదు చేయాలని ఏసీబీ ఉన్నతాధికారులు కోరారు.

# వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబుకు 14 రోజుల పాటు రిమాండ్






ఏపీ న్యూస్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు కు గుంటూరు కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. వివిధ కేసుల్లో అరెస్టయిన రాంబాబును రాజమండ్రి జైలు నుంచి గుంటూరు కోర్టుకు సోమవారం తరలించారు. వైద్య కళాశాలల పీపీపీ విధానంపై వైసీపీ నిర్వహించిన ఆందోళనలో అంబటి రాంబాబు పోలీసులతో దురుసుగా ప్రవర్తించడంతో ఆయనపై పీటీ వారెంట్ జారీ చేశారు.

ఈ కేసుతో పాటు తిరుమల లడ్డూ వ్యవహారంలో నిర్వహించిన నిరసనలో సీఎం చంద్రబాబుపై అసభ్య వ్యాఖ్యలు చేయడంతో ఆయనపై టీడీపీ నాయకులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులో కూడా గుంటూరు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో విచారణకు తీసుకువచ్చారు.

అంబటి రాంబాబు వేసిన బెయిల్ పిటిషన్‌పైతో పాటు జైలులో అదనపు సౌకర్యాలకు కల్పించాలని రాంబాబు వేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ కొనసాగింది. రిమాండ్ అనంతరం తిరిగి ఆయనను రాజమండ్రి జైలుకు తరలించారు.

# అసెంబ్లీ సమావేశాల వేళ.. వైసీపీ కీలక నిర్ణయం



ఏపీ న్యూస్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్ లో ఈ నెల 11 నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. తొలి రోజు ఉదయం 10 గంటలకు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. బడ్జెట్ సమావేశాలకు అన్ని పార్టీ ఎమ్మెల్యేలు హాజరుకావాలని స్పీకర్ ఇప్పటికే పిలుపునిచ్చారు.

వైసీపీ కీలక నిర్ణయం

ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశాలకు హాజరుకావాలని ఎమ్మెల్యేలు నిశ్చయించుకున్నారు. అయితే సమావేశాల మొత్తానికి కాదు. ఒక్క రోజు మాత్రమే సమావేశాలకు హాజరుకావాలని నిర్నయించుకున్నట్లు తెలుస్తోంది. గడిచిన 6 నెలలుగా ఎప్పుడు అసెంబ్లీ సమావేశాలు జరిగినా ఒక్క ఎమ్మెల్యే కూడా హాజరుకాలేదు. దీంతో ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఒక రోజు పాల్గొనే యోచనలో ఉన్నట్లు వైసీపీ వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో వైసీపీ ఎమ్మెల్యేల అసెంబ్లీ సమావేశాల హాజరుపై ఉత్కంఠ నెలకొంది. చూడాల మరి ఏం జరుగుతుందో.

# మళ్లీ బర్డ్ ఫ్లూ కలకలం.. హఠాత్తుగా 24 వేల కోళ్లు మృతి




ఏపీ న్యూస్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఏపీలో బర్డ్ ఫ్లూ వైరస్ మళ్లీ కలకలం రేపుతోంది. అన్నమయ్య జిల్లా సదుం మండలంలోని మూడు గ్రామాల్లో భారీ సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. పుట్టవాండ్లపల్లె, కంభంవారిపల్లె, అమ్మగారిపల్లె గ్రామాల్లోని కోళ్ల ఫారాల్లో గత కొన్నిరోజులుగా అసాధారణ రీతిలో కోళ్లు మరణించడం స్థానికంగా ఆందోళన కలిగించింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు దాదాపు 24 వేలకు పైగా కోళ్లు మరణించినట్లుగా నిర్ధారించారు.

అనుమానంతో మృతి చెందిన కోళ్ల నమూనాలను మధ్యప్రదేశ్‌లోని భోపాల్ గల హై సెక్యూరిటీ యానిమల్ డిసీజ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌కు పంపించగా.. బర్డ్ ఫ్లూ వ్యాధి నిర్ధారణ అయ్యింది. దీంతో చనిపోయిన కోళ్లు అన్నీ కూడా బర్డ్ ఫ్లూతోనే మరణించినట్లుగా అధికారులు ధృవీకరించారు. అమ్మగారిపల్లె, పుట్టవారిపల్లె కోళ్లు బర్డ్ ఫ్లూతోనే మరణించాయని నిర్ధారణ అయ్యిందని, కంభంవారిపల్లె గ్రామంలో చనిపోయిన కోళ్లకు చనిపోయిన కోళ్ల నివేదిక రావాల్సి ఉందని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై తెలిపారు.

ఈ పరిస్థితిని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సమీక్షించారు. వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన కోళ్ల ఫారాల రైతులకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందిస్తామని ప్రకటించారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో గ్రామాల్లో పర్యటించిన ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడూ పర్యవేక్షించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లా పరిధిలో ఎక్కడైనా కోళ్లు అసాధారణ రీతిలో మరణిస్తే 70139 14401, 93982 62752 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ఆందోళన అక్కర్లేదు

బర్డ్ ఫ్లూతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు సూచిస్తున్నారు. కోళ్ల నుంచి మనుషులకు ఈ వైరస్ సోకే అవకాశాలు చాలా తక్కువ అని తెలిపారు. 100 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ వేడి మీద ఉడికించిన మాంసంలో వైరస్ ఉండదని.. బాగా ఉడికించిన మాంసాన్ని తీసుకోవాలని సూచించారు. అయితే వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో మాత్రం కనీసం 10 రోజుల పాటు కోడిమాంసం, గుడ్ల తినకపోవడం మంచిదని చెబుతున్నారు.

# పవన్ కల్యాణ్ పెద్ద ఈగోయిస్ట్.. కాంగ్రెస్ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు






ఏపీ న్యూస్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్?పై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మరోసారి విమర్శలు గుప్పించారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారాని వస్తానని ప్రకటించిన పవన్ కల్యాణ్ ఆ పై తన పర్యటనలను రద్దు చేసుకోవడంపై అనిరుధ్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో జనసేనకు ప్రచారం చేసినా డిపాజిట్లు కూడా రావని తెలిసే పవన్ కల్యాణ్ తన పర్యటనను రద్దు చేసుకున్నారని విమర్శించారు. ఇవాళ ఓ న్యూస్ చానల్?తో మాట్లాడిన ఆయన.. పవన్ కళ్యాణ్?కు ప్రొడ్యూసర్ చంద్రబాబు, కో ప్రొడ్యూసర్ లోకేష్, తెలంగాణకు వచ్చేందుకు కొత్త ప్రొడ్యూసర్ మోడీని వెతుక్కున్నాడని సెటైర్ వేశారు. జనసేన ఆంధ్రా పార్టీ అని అక్కడి నుంచి తెలంగాణకి వచ్చి పెత్తనం చేస్తామంటే ఇక్కడి జనాలు ఊరుకోరన్నారు. ఆంధ్రవారు కేవలం మన దగ్గర ఉన్న భూములు, నిధుల కోసమే వస్తున్నారు తప్ప మనమీద ప్రేమతోకాదన్నారు.

పవన్ క్షమాపణలు చెప్పాల్సిందే:

తెలంగాణ ప్రజల నర దిష్టి వల్లే కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని మా సెంటిమెంట్?పై మాట్లాడిన పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పమని అడిగినా ఈ రోజుకూ క్షమాపణ చెప్పలేదని పవన్ కల్యాణ్?కు బాగో ఈగో అని విమర్శించారు. అయినా కొండగట్టుకు వస్తే రాష్ట్ర అతిథిగా గౌరవం ఇచ్చామన్నారు. ఆయన ఓ ఫార్వర్డ్ క్యాస్ట్ కు చెందిన వ్యక్తి అయినా శిలాఫలకం మీద ఆయన పేరు పైన రాసి మా బీసీ బిడ్డ కొండాసురేఖ పేరు కింద పెట్టాం. ఆరోజైనా కనీసం క్షమాపణలు చెప్తాడని అనుకున్నానని కానీ చెప్పలేదన్నారు. కొండగట్టుకు టీటీడీ డబ్బులు ఇస్తే అవి నేనే ఇచ్చానని చెప్పుకుంటున్నాడంటే ఆయన ఎలాంటి మనిషో మీరే అర్థం చేసుకోవాలన్నారు. సినిమాల వరకు పవన్ కల్యాణ్ ఓకే. ఆయన సినిమాలు బాగుంటే మేము కూడా చూస్తాం. కానీ ఇప్పుడు బీజేపీతో పొత్తు అని మాట్లాడాతున్నాడు. ఆయన ఎవరితోనైనా పొత్తులు పెట్టుకోవచ్చు. కానీ తెలంగాణ ప్రజలకు ఆయన క్షమాపణలు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

# దూరదర్శన్‌లో ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల




ఏపీ న్యూస్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): దూరదర్శన్ న్యూస్ ప్రాంతీయ వార్తా విభాగం, విజయవాడ 2026 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కోసం వార్తల సేకరణ నిమిత్తం జిల్లా ప్రతినిధులు (స్ట్రింగర్లు) ఎంపానెల్‌మెంట్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. అనుభవం కలిగిన వార్తా సేకరణ నిపుణుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్ ఎం యు (ప్రాంతీయ వార్త విభాగం), డీడీకే విజయవాడ హెడ్ ఆఫ్ న్యూస్ షఫీ మహమ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపానెల్‌మెంట్ ద్వారా జిల్లా స్థాయిలో వార్తలు, ప్రస్తుత వ్యవహారాలు, క్రీడలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి దూరదర్శన్ న్యూస్‌కు అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తాము దరఖాస్తు చేస్తున్న జిల్లాలోనే నివసిస్తూ, అక్కడే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థులు రూ.1,180 ప్రాసెసింగ్ ఫీజుతో కూడిన దరఖాస్తులను దూరదర్శన్ కేంద్రం, విజయవాడలోని ప్రాంతీయ వార్తా విభాగానికి సమర్పించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ ఫిబ్రవరి 20, 2026 సాయంత్రం 5 గంటల వరకుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఎంపానెల్‌మెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, అర్హతలు, దరఖాస్తు విధానం వంటి సమాచారం క్రింది నోటిఫికేషన్‌లో ప్రసార భారతి వెబ్ సైట్లో పొందుపరిచినట్లు ఆ ప్రకటనలో వెల్లడించారు.గర్లు) ఎంపానెల్‌మెంట్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. అనుభవం కలిగిన వార్తా సేకరణ నిపుణుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్ ఎం యు (ప్రాంతీయ వార్త విభాగం), డీడీకే విజయవాడ హెడ్ ఆఫ్ న్యూస్ షఫీ మహమ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ ఎంపానెల్‌మెంట్ ద్వారా జిల్లా స్థాయిలో వార్తలు, ప్రస్తుత వ్యవహారాలు, క్రీడలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి దూరదర్శన్ న్యూస్‌కు అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తాము దరఖాస్తు చేస్తున్న జిల్లాలోనే నివసిస్తూ, అక్కడే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థులు రూ.1,180 ప్రాసెసింగ్ ఫీజుతో కూడిన దరఖాస్తులను దూరదర్శన్ కేంద్రం, విజయవాడలోని ప్రాంతీయ వార్తా విభాగానికి సమర్పించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ ఫిబ్రవరి 20, 2026 సాయంత్రం 5 గంటల వరకుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఎంపానెల్‌మెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, అర్హతలు, దరఖాస్తు విధానం వంటి సమాచారం క్రింది నోటిఫికేషన్‌లో ప్రసార భారతి వెబ్ సైట్లో పొందుపరిచినట్లు ఆ ప్రకటనలో వెల్లడించారు.

# ఏపీలోని 175 నియోజకవర్గాలకు ర్యాంకులు




ఏపీ న్యూస్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): కూటమి ప్రభుత్వ తీరుపై సీఎం చంద్రబాబు నాయుడు ఫోకస్ పెట్టారు. ఈమేరకు నియోజకవర్గాల్లో సర్వేలు చేయించారు. ప్రభుత్వం పథకాల అమలు, ఫైల్స్ క్లియరింగ్, శాసనసభ్యుల పని తీరు, పట్టణ, గ్రామాల్లో ప్రగతి, గతం, ప్రస్తుత పరిస్థితులపై సర్వే నిర్వహిస్తుంటారు. ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటారు. అనంతరం ర్యాంకులు ప్రకటిస్తారు. కొద్ది రోజుల క్రితం పార్లమెంట్ నియోజకవర్గాలకు ర్యాంకులు ప్రకటించిన ఆయన తాజాగా అసెంబ్లీ నియోజకవర్గాలకు ర్యాంకులు కేటాయించారు. వివిధ అంశాల్లో 175 నియోజకవర్గాలకు ర్యాంకులు ప్రకటించారు. వివిధ ఇండికేటర్లను దృష్టిలో పెట్టుకుని ఈ ర్యాంకులు వెల్లడించారు. మొత్తం 175 నియోజకవర్గాల్లో ఏ ప్లస్‌లో 21 నియోజకవర్గాలు కాగా వీటిలో ఏ గ్రేడ్‌లో 153 నియోజకవర్గాలు ఉన్నాయి. ఇక బీ గ్రేడ్‌లో ఒక నియోజకవర్గం మాత్రమే ఉండటం విశేషం. 90 శాతం పైగా మార్కులతో ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన 13 నియోజకవర్గాలు ఉండగా 93 మార్కులతో నంబర్ వన్‌గా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఉంది. 92 మార్కులతో గాజువాక రెండో ర్యాంక్ సాధించింది. కాకినాడ నియోజకవర్గం 3వ ర్యాంక్ సాధించగా విజయవాడ తూర్పు 4వ ర్యాంక్‌గా నిలిచింది. ఈ ర్యాంకుల ఆధారంగా ముమ్ముందు పని తీరును మరింత కనబర్చాలని మంత్రులు, అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు.

## ఘనంగా యుటిఎస్ 55వ ఆవిర్భావ దినోత్సవం



నర్సింహులపేట, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): సామల యాదగిరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పి ఆర్ టి యు టీఎస్ 55వ ఆవిర్భావ అదినోత్సవం సందర్భంగా నర్సింహులపేట ఎం ఆర్ సి లో సంఘ పతాక ఆవిష్కరణ చేసి ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల కు కనీస సౌకర్యాలు అయినటువంటి జాూాఖాూా ాజూాఎజుూ కూడా తీసుకోలేని లేని రోజుల్లో ఉపాధ్యాయ సమస్యల సాధన ధ్యేయంగా సామల యాదగిరి నేతృత్వంలోమానుకోట గడ్డపై పురుడు పోసుకున్న సంఘం నేడు రెండు రాష్ట్రాలలో మొనగాని సంఘంగా వెలుగొందుతూ ఎంఎల్సి. పింగళి శ్రీపాల్ రెడ్డి నాయకత్వంలో ఉపాధ్యాయ సమస్యలు ముందుంటూ రాష్ట్రము లో ఉపాధ్యాయ సంఘం లో పెద్ద సంఘమే కాకుండా ఉద్యోగ సంఘాలన్నిటికీ దిక్సుచి లా మారిందని తెలియజేసారు... ఇటీవల పి ఆర్ టి యు టి ఎస్. వ్యవస్థాపక సభ్యులు అయిన సంకేపల్లి రాఘవ రెడ్డి మరణించిన సందర్భంగా వారికిరెండు నిమిషాలు మౌనం పాటించి మరో ఫౌండర్ మెంబర్ మరో వ్యవస్థాపక సభ్యులైన గండి బిక్షం ని, పి ఆర్ టి యు సీనియర్ నాయకులైన ఎల్లారెడ్డి ,శ్యాంసుందర్ రెడ్డి ,పెద్ద నాగారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి జానకి సుమన గారిని, ఇటీవల పదోన్నతి పొందిన జయపాల్ రెడ్డి మాధవి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొండ సంజీవ రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్ జిల్లా బాధ్యులు, వెంకటరెడ్డి,శేఖర్,మోహన్ రెడ్డి,నగేష్ మండల బాధ్యులు పి. శ్రీను మహిపాల్, యాక సాయిలు కరుణాకర్,శ్యాంబాయి, భాగ్యలక్ష్మి రజిత,శంకర్ మరియు సి ఆర్ పి.మిత్రులు ఎం ఆర్ సి. సిబ్బంది తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన, ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కూసుమంచి మండలం మల్లేపల్లి గ్రామ సర్పంచ్ భవిత, గ్రామంలో ప్రజల నివాసాలకు దగ్గరలో ప్రజలకు హాని కలిగించే విధంగా బాయిలర్ రైస్ మిల్లులను ఏర్పాటు చేస్తున్నారని, దీనిని నిలిపి వేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈ.ఈ పీ.సీ.బీ కు రాస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కూసుమంచి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన వి.శంకర్ నకిలి, కల్తీ కలుపు మందు వల్ల పంట నష్టం వచ్చిందని, కల్తి కలుపు మందు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవా లని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఖమ్మం అర్బన్ మండలం 14వ డివిజన్ కు చెందిన మహ్మద్ మహబూబ్ అలీ వెలుగు మట్ల రెవెన్యూ సర్వే నెంబర్ 95 లో అక్రమంగా ఆక్రమించిన భూమి, దానికి సంబంధించి పొందిన ఫేక్ పట్టా పాస్ పుస్తకంపై దర్యాప్తు చేసి రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరం శ్రీరామ్ నగర్ కు చెందిన కే.చక్రపాణి తనకు 2016 నుంచి 2019 వరకు దివ్యాంగుల పెన్షన్ వచ్చిందని, తనకు ఆగిపోయిన దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఆర్డిఏ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డి.ఆర్.ఓ ఏ.పద్మశ్రీ, జెడ్పీ సీ.ఈ.ఓ దీక్ష రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సుభాష్ నగర్ లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డివిజన్ జనరల్ సెక్రటరీ ద్వారంపూడి నాగిరెడ్డి



కుత్బుల్లాపూర్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): సుభాష్ నగర్ పరిధి లోని సుభాష్ నగర్ లాస్ట్ బస్టాప్ లో డబ్బా గ్రౌండ్ లో మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డివిజన్ జనరల్ సెక్రెటరీ ద్వారా నాగిరెడ్డి మాట్లాడుతూ ఇలా స్లమ్ ఏరియాలో ఫ్రీ హెల్త్ క్యాంప్ నిర్వహించడం చాలా బాగుందని అన్నారు అదేవిధంగా ఈ యొక్క కాలనీలో చాలామంది బీదవారు ఉన్నారు వారికి ఆరోగ్య సమస్య లు ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నా మమ్మల్ని సంప్రదిస్తే ఏ సమస్య అయినా తీరుస్తానని అన్నారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో క్యాన్సర్ స్క్రీనింగ్, గైనకాలజీ కార్డియా డయాబెటిస్ బిపి, షుగర్, బ్లడ్ టెస్ట్ లు కంటి పరీక్షలు డెంటల్ మొదలగునవి పరీక్షలు చేయబ డును అని అన్నారు ఈ కార్యక్రమం లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీడివిజన్ జనరల్ సెక్రెటరీ ద్వారంపూడి నాగిరెడ్డి, ఈ కార్యక్రమం నిర్వహించిన హోలీ పైత్ హోమ్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ జాన్ కెనడి, ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో డాక్టర్లు రాందేవ్ రెడ్డి, వెంకయ్య, లక్ష్మి బాదం, స్వవాదామా, ట్రాన్స్పోర్ట్ పరుశురాం ప్రభాకర్, పాస్టర్ ప్రమీల, పాస్టర్ హైనీ ఎమీలియా, రమాదేవి, సంఘ సభ్యులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

## 17వార్డులో విస్తృత ప్రచారం చేసిన బలరాం నాయక్



మహబూబాబాద్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మానుకోట మున్సిపాలిటీ 17వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి మూడు బాలు నాయక్ గెలుపుకోసం ఇంటింటి ప్రచారం నిర్వహించిన టీపీసీసీ రాష్ట్ర ఆదివాసి గిరిజన వైస్ చైర్మన్ డ బంజారా జన సమితి రాష్ట్ర అధ్యక్షులు కర్ణావత్ గాంధీ నాయక్ మానుకోట మున్సిపాలిటీ 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి శమూడ్ బాలు చౌహన్ గెలుపు కోసం టీపీసీసీ రాష్ట్ర ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్ విస్తృతంగా ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.. ఈ సందర్భంగ 17 వార్డు పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రజలను ఆత్మీయంగా పలకరించారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచి చేతి గుర్తుకు ఓటు వేసి బాలు నాయక్ ఘన విజయం అందించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకున్న బాలు నాయక్, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, ఇందిరమ్మ ఇల్లు, రోడ్డు సమస్య లు అంగన్వాడీ కోసము బిల్డింగ్, గల్లీ గల్లీ కి సీసీ రోడ్డులు గత 10 సంవత్సరాలు పెండింగ్ వున్నా సమస్యలు ఇల్లు కట్టు కున్న వారికి ఇల్ల పట్టాలు బాలు నాయక్ తో సాధ్యం అవుతుంది అన్ని హామీ ఇవ్వడం జరిగింది. పారిశుధ్యం వంటి మౌలిక సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. అభ్యర్థి బాలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

## బీజేపీ తోనే తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధి.. సాధ్యం



తొర్రూరు, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా తొర్రూరు పట్టణంలో స్థానిక 1వ వార్డులో బీజేపీ అభ్యర్థి పూసాల రజిత శ్రీమాన్ మరియు 2వార్డు అభ్యర్థి పల్లె కుమార్ లో విజయం కాంక్షిస్తూ ఇంటింటి విస్తృత ప్రచారం నిర్వహించడం జరిగింది.అనంతరం ఏర్పాటు చేసిన.స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో బీజేపీ రాష్ట్ర నాయకులు మాజీ పార్లమెంటు సభ్యుడు ప్రొఫెసర్ సీతారాం నాయక్,మాజీ శాసనసభ్యులు డాక్టర్ టి.రాజేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా మాట్లాడుతూ తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధి బీజేపీ తోనే సాధ్యం అవుతుంది అని తెలిపారు.బీజేపి అభ్యర్థులను గెలిపిస్తే ప్రధాని నరేంద్ర మోడీ సహాయ సహకారాలతో అత్యధిక శాతం నిధులు మంజూరు చేయించి తొర్రూరు పట్టణాన్ని అత్యాధునిక మోడల్ తొర్రూరు గా అభివృద్ధి చేస్థామని తెలిపారు.ఈకార్యక్రమంలో బీసీ కమీషన్ మాజీ చైర్మన్ వకులాభరణం క్రిష్ణమోహన్,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి, మున్సిపాలిటీ ఎన్నికల సహ ఇంఛార్జి జలగం రంజిత్, భాగాల నవీన్ రెడ్డి,ధరావత్ శ్రీనివాస్,పప్పుశెట్టి సంతోష్, దేవరకొండ విష్ణు, వడ్లకొండ రవి,రాపాక ప్రశాంత్, పెంద్యాల గణేష్,రాయపురం సుష్మ రాజకుమార్,కుమ్మరికుంట్ల శ్రీకాంత్,అజయ్, నూకల నవీన్,శీలం శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.



## కేటీఆర్ పై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



తొర్రూరు, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై సోమవారం తొర్రూరు పోలీస్ స్టేషన్ లో కాంగ్రెస్ పార్టీ మండల,పట్టణ,ఎస్సీ,ఎస్టీ బీసీ, మహిళ, యూత్ కమిటీల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్ లు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాజాగా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని గాంధీ సెంటర్ లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ సభలో సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అన్నారు. సీఎం స్థాయి వ్యక్తిపై జుగుప్సాకర వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ పై కేసు నమోదు చేయాలని ఎస్సై ఉపేందర్ ను కోరారు. సీఎం పరువు దిగజారే లా మాట్లాడే స్థాయి కేటీఆర్ కు లేదన్నారు. సంస్కారహీనంగా మాట్లాడిన కేటీఆర్ పై పలు శిక్షల కింద కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పింగిలి ఉష, సర్పంచ్ లు మై పాషా,బంగారు రమేష్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ యాదవ్,యూత్ నాయకులు హరికృష్ణ,పట్టణ మహిళా నాయకులు ధరావత్ జమున సోమన్న, వెలుగు మహేశ్వరి, యశోద, రాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై బాలనగర్ డివిజన్లో పాదయాత్ర నిర్వహించిన కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి



కూకట్ పల్లి, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): బాలానగర్ డివిజన్లోని రాజీవ్ గాంధీ నగర్. ఎన్టీఆర్ నగర్. శ్రీశ్రీ నగర్ లలో త్రాగునీరు. మరియు డ్రైనేజీ సమస్యలపై స్థానిక నాయకులు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు. వాటర్ వర్క్స్. సానిటేషన్ డిపార్ట్మెంట్ లతో కలిసి గల్లి గల్లి తిరుగుతూ పాదయాత్ర నిర్వహించారు బాలనగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం డ్రైనేజీ ప్రాబ్లం ఉందని మంచినీరు సరిగా రావడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అయినా ఇప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని సమస్యను వాటర్ వర్క్స్ జిఎం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆయన 10 రోజులలో ప్రాబ్లం సాల్వ్ చేస్తానని చెప్పారని ఒకవేళ పది రోజులలో సమస్య పరిష్కారం కాకపోతే బస్తి వాసులతో కలిసి వారి ఆఫీస్ ముందు ధర్నా చేయడం జరుగుతుందని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి హెచ్చరించారు. పేద ప్రజలు నివసించే ప్రాంతాలను విస్మరించి వారిని ఇబ్బందులకు గురి చేయడం కరెక్ట్ కాదని మానవత్వంతో వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో అజిత్. నగేష్. నరేష్ .మొహమ్మద్ సోఫీ. వహీద్. దుర్గేష్. కిట్టు. సురేఖ రెడ్డి .ఎడ్ల ప్రభాకర్. మల్లారెడ్డి. అరబ్. దేవేందర్. రంగంపేట శ్రీను. కే రమేష్. మహేందర్ యాదవ్. సత్తి .మరియు వాటర్ వర్క్స్ ఏఈ సతీష్. వర్క్ ఇన్స్పెక్టర్ రాములు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ ను కలిసిన శివమ్మ బస్తి నూతన కమిటీ సభ్యులు



కూకట్పల్లి, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శివమ్మా కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కు కాలనీ ప్రెసిడెంట్ గా ఎన్నికైన జక్కుల నరసింహ మరియు సభ్యులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శాలవతో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శివమ్మా కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని, కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని, ఏ చిన్న సమస్య ఐన తన దృష్టికి గాని తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని అన్నారు. నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులు కాలనీ వాసులందరికి ఎల్లవేళాలో అందుబాటులో ఉంటూ కాలనీ సమస్యల పై స్పందిస్తూ ప్రతి ఒక్కరు సమిష్టిగా కలిసి కాలనీ అభివృద్ధి కి పాటుపడాలని ఒక ఆదర్శవంతమైన కాలనీ గా తీర్చిదిద్దే క్రమం లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్. జక్కుల నరసింహ, వైస్ ప్రెసిడెంట్. గుంతమల్ల గిరి, జనరల్ సెక్రెటరీ అంకిడి సతీష్, జాయింట్ సెక్రెటరీ ఓట్టుకుల తిరుపతి రాజ్, ఆర్గనైజర్ సెక్రటరీ జింకల కృష్ణయ్య, ఆర్గనైజర్ జాయింట్ సెక్రెటరీ జక్కుల చిన్నఅంజి, ట్రెజరర్. బాచుపల్లి రామచంద్రర్, అడ్వైజర్స్ ఎన్ సిద్దయ్య, కాయిత నర్సిములు, మన్యం, ఆదినారాయణ, డి. రాజశేఖర్ చారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ బుచ్చయ్య, గోవింద్ గారి నవీన్ కుమార్, జక్కుల శేఖర్, కె .కృష్ణ, ఎస్. దుర్వాసులు, రమేష్, మోహన్ నాయక్, సురేష్, బి కృష్ణ, యం. సురేష్, నీలా రావు, బాలాపీర్, తిరుపతిరావు, రాములు, యం. రాజు తదితరులు పాల్గొన్నారు.

## 26 వార్డ్ అభివృద్ధి కొరకు కష్టపడి పని చేస్తా -ఎస్ కే.కైరున్ షాపి



వనపర్తి, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): వనపర్తి మున్సిపాలిటీ 26వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కైరున్ షఫీ మాట్లాడుతూ... వార్డు ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ, అభివృద్ధిలో పట్టణానికి ఆదర్శంగా 26 వ వార్డు ను తీర్చిదిద్దుతానని యువకులు వార్డు ప్రజలు తమను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.తమను గెలిపిస్తే సీసీ కెమెరాలు,హైమాక్స్ లైట్స్,సిసి రోడ్లు, డ్రైనేజీలు,అంగన్వాడి కేంద్రం,కొత్త రేషన్ షాపు, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు,ఇందిరమ్మ చీరలు,ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల డాక్టర్ మెడిసిన్ ఏర్పాటు,యువకులకు స్పోర్ట్స్ జిమ్ ఏర్పాటు,అని అభివృద్ధి పనులు చేసుకుందామని వార్డు ప్రజల ఇష్టం మేరకు పారదర్శకత పాలన లక్ష్యంగా ముందుకు సాగుతామని అన్నారు.

# ఓట్స్ ను రోజూ తింటే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే.. మిస్ చేసుకోకుండా తినండి..!

హెల్త్ న్యూస్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మన ఆరోగ్యానికి మేలు చేసే తృణ ధాన్యాలల్లో ఓట్స్ కూడా ఒకటి. వీటిలో బీటా గ్లూకాన్ అని పిలువబడే కరిగే ఫైబర్ తో పాటు అవెనాంత్రామైడ్స్ అని పిలువబడే యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. ఓట్స్ ను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, షుగర్ ను అదుపులో ఉంచడంలో, బరువును తగ్గించడంలో, జీర్ణశక్తిని మెరుగుపరచడంలో ఇలా అనేక రకాలుగా ఓట్స్ మనకు సహాయపడతాయి. వీటిని తరచూ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఓట్స్ ను ఆహారంగా తీసుకోవడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



కొలెస్ట్రాల్ తగ్గేందుకు..

ఓట్స్ ను తీసుకోవడం వల్ల వీటిలో ఉండే ఫైబర్ పేగుల్లో ఉండే కొలెస్ట్రాల్ ను బంధిస్తుంది. తద్వారా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. వీటిని తరచూ తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ దాదాపు 5 నుండి 10 శాతం వరకు తగ్గుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఓట్స్ ను తీసుకోవడం వల్ల కార్బోహైడ్రేట్స్ రక్తంలోకి నెమ్మదిగా ప్రవేశిస్తాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే పెరగకుండా ఉంటాయి. టైప్ 2 డయాబెటిస్ తో బాధపడే వారు ఓట్స్ ను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిల్లో హెచ్చు తగ్గులు రాకుండా ఉంటాయి. అలాగే ఓట్స్ ను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల దీనిలో ఉండే ఫైబర్ ధమనుల ఆరోగ్యానికి మద్దతును ఇస్తుంది. దీంతో సిస్టోలిక్ బిపి అదుపులో ఉంటుంది. ఓట్స్ ను 8 వారాల పాటు తీసుకోవడం వల్ల సిస్టోలిక్ బీపీ 2 నుండి 3 ఎమ్ఎమ్ హెచ్‌జి వరకు తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.

బరువు తగ్గాలంటే..

అధిక రక్తపోటుతో బాధపడే వారు ఓట్స్ ను రోజూ తీసుకోవడం వల్ల మంచి ఫలితాలను చూడవచ్చు. ఓట్స్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి త్వరగా వేయకుండా ఉంటుంది. దీంతో మనం క్యాలరీలను తక్కువగా తీసుకుంటాం. తద్వారా శరీర బరువు అదుపులో ఉంటుంది. ఓట్స్ ను తీసుకోవడం వల్ల పేగులో మంచి బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. మలబద్దకం సమస్య తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఓట్స్ లో మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరానికి కావల్సిన శక్తి లభిస్తుంది. ఇలా అనేక రకాలుగా ఓట్స్ మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని వీటిని తీసుకోవడం వల్ల మనం అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయని వైద్యులు తెలియజేస్తున్నారు.

# విటమిన్ లేదా మినరల్ ట్యాబ్లెట్లను వాడుతున్నారా..? అయితే ఈ విషయాలను తెలుసుకోవాల్సిందే..!

హెల్త్ న్యూస్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్):సాధారణంగా మనం అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యుడిని సంప్రదించి వారు సూచించిన ప్రకారం మందులను, సప్లిమెంట్స్ ను వాడుతూ ఉంటాం. కానీ నేటి కాలంలో చాలా మంది ప్రజలు ఎటువంటి సూచనలు, ప్రిస్క్రిప్షన్ వంటివి లేకుండానే మందులను తీసుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల మనకు అనేక దుష్ప్రభావాలు కలిగే అవకాశం కూడా ఉంది. మనకు మనమే రోగాన్ని నిర్ధారణ చేసుకుని మందులు వేసుకోవడం వల్ల మందుల మోతాదు పెరిగిపోవడమే కాకుండా అవి ఇతర మందులతో కలిసి అనారోగ్యానికి దారి తీసే అవకాశం ఉంది. కనుక దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు మందులు వాడే ముందు వాటి మోతాదును, ప్రభావాలను తెలుసుకోవడానికి వైద్యుడిని సంప్రదించడం చాలా అవసరం.



వీటిని రోజూ తీసుకోవాలి..

అనారోగ్యాన్ని తగ్గించడంలో మందులను తీసుకునే మోతాదు, సమయం ప్రభావం ఎంతో ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. భోజనం తరువాత తీసుకోవడం వల్ల కొన్ని మందుల శోషణ పెరుగుతుంది. అలాగే కొన్ని మందులను మనం క్రమం తప్పకుండా రోజూ తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి మందులను తగిన సమయంలోనే తీసుకోవాల్సి ఉంటుందని ఇవన్నీ తెలియకుండా మనం మందులను తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తగ్గకపోగా కొత్త అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కొందరు విటమిన్లకు సంబంధించిన సప్లిమెంట్స్ ను తీసుకుంటూ ఉంటారు. అయితే కొన్ని నీటిలో కరిగే, కొవ్వులో కరిగే విటమిన్లు ఉంటాయి. విటమిన్ సి తో పాటు బి విటమిన్లు నీటిలో కరిగే విటమిన్లు. కనుక ఇవి మూత్రం ద్వారా రోజూ విసర్జించబడతాయి. కనుక నీటిలో కరిగే విటమిన్లను క్రమం తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది.

ఏ సమయంలో అయినా సరే.. కానీ..?

చాలా వరకు విటమిన్లను రోజులో ఏ సమయంలోనైనా, ఆహారంతో లేదా ఆహారం లేకుండా తీసుకోవచ్చు. అయితే ఆస్కార్బిక్ ఆమ్లాన్ని ఆహారంతో తీసుకోవడం వల్ల గ్యాస్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అదే విధంగా చాలా మంది ఐరన్ సప్లిమెంట్స్ ను తీసుకుంటూ ఉంటారు. ఖాళీ కడుపుతో ఐరన్ సప్లిమెంట్స్ ను తీసుకోవచ్చు. అయితే ఇది కొందరిలో కడుపు నొప్పిని కలిగిస్తుంది. అలాంటి సమయంలో ఏదైనా తిన్న తరువాత తీసుకోవాలి. అయితే క్యాల్షియం ఎక్కువగా ఉండే పాలు వంటి ఆహారాలను తీసుకున్న తరువాత ఐరన్ సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల శరీరం ఐరన్‌ను ఎక్కువగా గ్రహించదు. మెగ్నీషియం సప్లిమెంట్స్ ను కూడా చాలా మంది తీసుకుంటూ ఉంటారు. వీటిని ఎక్కువగా రాత్రిపూట తీసుకుంటారు. కొందరు నిద్ర నాణ్యతను పెంచుకోవడానికి రాత్రిపూట మెగ్నీషియం సప్లిమెంట్స్ ను తీసుకుంటారు.

అన్నీ ఒకేసారి వద్దు..

అయితే ఒకేసారి క్యాల్షియం, జింక్, మెగ్నీషియం సప్లిమెంట్స్ ను కలిపి తీసుకోకూడదు. వీటిని వైద్యుడి సూచన మేరకు ఏ సమయంలో తీసుకోవడం మంచిదో తెలుసుకుని తీసుకోవాలి. ఇక రోజులో అనేక సప్లిమెంట్స్ తీసుకునే వారు గందరగోళానికి గురవుతూ ఉంటారు. అలాంటి వారు రోజూ ఎంత మోతాదులో ఏయే సప్లిమెంట్స్ ను తీసుకుంటున్నామో, ఏ సమయంలో తీసుకుంటున్నామో ఒక రికార్డులో నమోదు చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల సప్లిమెంట్స్ తీసుకునే విషయంలో గందరగోళం లేకుండా ఉంటుంది. మందులు లేదా సప్లిమెంట్స్ ఏవైనా కూడా వైద్యుడిని సంప్రదించిన తరువాత తీసుకోవడమే మన ఆరోగ్యానికి మంచిది. కనుక ఎవరూ కూడా వారి సొంతంగా మందులను, సప్లిమెంట్స్ ను తీసుకోకపోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.



KR TV క్రాంతి
మంగళవారం 10 ఫిబ్రవరి 2026

# క్రీడలు

epaper.krtvnews.com



## చైనాలో మారుమోగిన 'జనగణమన'

### ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్‌లో తేజస్విన్ శంకర్ స్వర్ణ విజయం




స్పోర్ట్స్ న్యూస్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): శత్రుదేశంగా భావించే చైనా నేలపై భారత జాతీయ గీతం మారుమోగింది. చైనాలోని టియాంజిన్ వేదికగా జరిగిన ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2026లో భారత అథ్లెట్ తేజస్విన్ శంకర్ అద్భుత ప్రతిభ కనబరిచి పురుషుల హెప్టాథ్లాన్ విభాగంలో స్వర్ణ పతకం సాధించారు. మొత్తం ఏడు ఈవెంట్లతో కూడిన ఈ పోటీలో తేజస్విన్ స్థిరమైన ప్రదర్శనతో 5993 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. మెడల్ ప్రదానోత్సవ సమయంలో భారత జాతీయ గీతం 'జనగణమన' వినిపించడంతో అక్కడి వాతావరణం గర్వభావంతో నిండిపోయింది. ఈ విజయంతో తేజస్విన్ శంకర్ తన పాత జాతీయ రికార్డును తానే అధిగమిస్తూ కొత్త రికార్డు సృష్టించారు.

6000 పాయింట్ల మైలురాయిని చేరడానికి కేవలం 7 పాయింట్ల తేడాతో నిలిచిపోయినా, ఆసియా స్థాయిలో స్వర్ణం సాధించడం విశేషంగా నిలిచింది. రెండు రోజుల పాటు సాగిన ఈ హెప్టాథ్లాన్ పోటీల్లో 60 మీటర్ల స్ప్రింట్, లాంగ్ జంప్, షాట్‌పుట్, హైజంప్, 60 మీటర్ల హర్డిల్స్, పోల్ వాల్ట్, 1000 మీటర్ల రన్ వంటి విభాగాలు ఉన్నాయి. ప్రతి ఈవెంట్‌లోనూ తేజస్విన్ నిలకడైన ప్రదర్శన కనబరిచి పాయింట్ల పట్టికలో ముందంజలో కొనసాగారు. ముఖ్యంగా హైజంప్ విభాగంలో సాధించిన అత్యధిక పాయింట్లు ఆయన విజయానికి కీలకంగా మారాయి.

ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు లభించిన ఏకైక స్వర్ణ పతకం ఇదే కావడం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన తేజస్విన్, ఇండోర్ అథ్లెటిక్స్‌లోనూ తన సత్తా చాటుతూ దేశానికి గౌరవాన్ని తీసుకువచ్చారు. చైనా నేలపై త్రివర్ణ పతాకం ఎగరడంతో పాటు భారత జాతీయ గీతం వినిపించడమే దేశవ్యాప్తంగా క్రీడాభిమానులను ఆనందంలో ముంచెత్తింది. ఈ విజయం భారత అథ్లెటిక్స్‌కు మరో గొప్ప మైలురాయిగా నిలిచింది.

## ఎంఎస్ ధోనీలా సిక్సులు కొట్టాలి.. ఇదే మేం నేర్చుకున్న గుణపాఠం: నేపాల్ క్రికెటర్




స్పోర్ట్స్ న్యూస్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ముంబై వాంఖడే స్టేడియంలో జరిగిన ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 మ్యాచ్‌లో నేపాల్ జట్టు అద్భుత పోరాటం చేసింది. బలమైన ఇంగ్లండ్ జట్టును చివరి ఓవర్ వరకు ఉత్కంఠకు గురి చేసిన నేపాల్.. కేవలం నాలుగు పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఓటమి అనంతరం నేపాల్ క్రికెటర్ నందన్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచ క్రికెట్లో చర్చనీయాంశంగా మారాయి. మ్యాచ్ అనంతరం ప్రెజెంటేషన్‌లో మాట్లాడిన నందన్.. ఈ ఓటమి నుంచి తమ జట్టు ఎన్నో పాఠాలు నేర్చుకుందని చెప్పాడు.

ముఖ్యంగా చివరి ఓవర్ విషయాన్ని నందన్ యాదవ్ ప్రస్తావిస్తూ... 'మాకు నేర్చుకున్న పాఠం ఏంటంటే.. ఇన్నింగ్స్ చివర్లో సిక్సర్లు బాదాలి. భారత్ మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీలా మ్యాచ్ ఫినిష్ చేయాలి' అంటూ ఆసక్తికర వ్యాఖ్య చేశాడు. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇంగ్లండ్ నిర్దేశించిన 185 పరుగుల లక్ష్య ఛేదనలో నేపాల్ చివరి ఓవర్‌లో 10 పరుగులు చేయాల్సి ఉండగా.. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఆ ఓవర్‌లో కేవలం ఐదు పరుగులే ఇచ్చి ఇంగ్లండ్‌కు అద్భుత విజయాన్ని అందించాడు.

ఈ అద్భుత పోరాటం అనంతరం నేపాల్ జట్టుపై ప్రశంసల వర్షం కురిసింది. అందరిలోకెల్లా దక్షిణాఫ్రికా లెజెండరీ ఫాస్ట్ బౌలర్ డేల్ స్టెయిన్ రియాక్షన్ అందరి దృష్టిని ఆకర్షించింది. 'నేపాల్.. మీకు ఎప్పుడు అవసరమైతే నా సేవలు అందిస్తాను. పైకి, పైకి, ఇంకా పైకి వెళ్లండి' అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. స్టెయిన్ ప్రశంసలు నేపాల్ జట్టుకు గొప్ప గౌరవమని నందన్ యాదవ్ పేర్కొన్నాడు. 'క్రికెట్‌ను పదేళ్ల పాటు ఏలిన ఓ లెజెండ్ ఇలా స్పందించడం మాకు ఎంతో గర్వంగా ఉంది. కానీ ఇది మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన విషయం' అంటూ చెప్పాడు.

మ్యాచ్ తర్వాత తమ భావోద్వేగాలపై నందన్ యాదవ్ స్పందిస్తూ.. 'మాకు చాలా గర్వం కూడా ఉంది. అలానే బాధ కూడా ఉంది. ఇంగ్లండ్ లాంటి బలమైన జట్టుతో పోటీ పడి విజయంకు అతి దగ్గరలో ఓడిపోవడం బాధగా ఉంది. కానీ ఇలాంటి ప్రదర్శన చేయగలిగినందుకు గర్వంగా కూడా ఉంది. కాబట్టి ఇది మాకుమంచి అనుభూతి' అని అన్నాడు. మ్యాచ్ విషయానికి వస్తే.. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 184 పరుగులు చేసింది. జాకబ్ బేతెల్ (55), కెప్టెన్ హ్యారీ బ్రూక్ (53) హాఫ్ సెంచరీలు చేశారు. చివర్లో విల్ జాక్స్ 18 బంతుల్లో 39 పరుగులతో దూకుడు చూపించాడు. నేపాల్ బౌలర్లలో దీపేంద్ర సింగ్ ఐరీ, నందన్ యాదవ్ ఇద్దరూ రెండేసి వికెట్లు తీశారు. ఛేదనలో నేపాల్ 80/6తో పరిమితమైంది. కెప్టెన్ రోహిత్ పౌడెల్ (39), దీపేంద్ర సింగ్ ఐరీ (44) పరుగులు చేశారు. భవిష్యత్తులో నేపాల్ క్రికెట్ నుంచి మరింత సంచలనాలు రావడం

## ఇండియాతో ఆడాలంటే.. 3 కీలక షరతులు పెట్టిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు

స్పోర్ట్స్ న్యూస్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): టీ20 వరల్డ్‌కప్‌లో ఇండియాతో ఫిబ్రవరి 15వ తేదీన జరగనున్న మ్యాచ్‌ను ఆడబోమని పాకిస్థాన్ చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆ మ్యాచ్‌ను నిర్వహించేందుకు ఐసీసీ తమ వంతు ప్రయత్నం చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఇద్దరు సభ్యుల బృందం పాకిస్థాన్ వెళ్లింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మెన్ మోషిన్ నక్వీతో చర్చలు నిర్వహించారు. భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు మూడు కీలక షరతులు పాకిస్థాన్ పెట్టినట్లు తెలుస్తోంది.

ఓ మీడియా కథనం ప్రకారం ఆ షరతులు ఇలా ఉన్నాయి. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు వార్షిక నిధులను ఐసీసీ పెంచాలని కోరింది. ఇక ఇండియా, భారత్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లను పునరుద్దరించాలని ఐసీసీని అభ్యర్థించింది. అయితే ఇండియా, పాక్ మధ్య మ్యాచ్ జరుగుతున్న సమయంలో.. ఆటగాళ్లు ఆన్‌ఫీల్డ్ ఎథిక్స్ పాటించాలని, ప్లేయర్లు అందరూ షేక్ హ్యాండ్ ఇచ్చుకోవాలని పాక్ క్రికెట్ బోర్డు ఐసీసీని కోరినట్లు తెలుస్తోంది. టీ20 వరల్డ్‌కప్ నుంచి బంగ్లాదేశ్‌ను బహిష్కరించిన నేపథ్యంలో ఆ దేశానికి మద్దతు ఇస్తూ ఇండియాతో ఆడేందుకు పాకిస్థాన్ నిరాకరించిన విషయం తెలిసిందే.

ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కలిసిన తర్వాత తుది నిర్ణయం వెల్లడించనున్నట్లు నక్వీ తెలిపారు.




## బీసీసీఐ సెలక్షన్ కమిటీలో సంచలనం!




స్పోర్ట్స్ న్యూస్, 09 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): భారత క్రికెట్‌లో మరో కీలక మార్పు జరగబోతుందా? అంటే.. అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం భారత క్రికెట్ మండలి (బీసీసీఐ) సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న అజిత్ అగార్కర్ స్థానంలో టీమిండియా మాజీ హెడ్ కోచ్, లెజెండరీ బ్యాట్స్‌మన్ రాహుల్ ద్రవిడ్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ద్రవిడ్ కోచ్‌గా ఉన్నప్పుడు భారత్ టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన విషయం తెలిసిందే. స్వదేశీ, విదేశీ గడ్డలపై అద్భుత విజయాలు అందుకుంది.

భారత జట్టు కోచ్‌గా తన పదవీకాలంలో రాహుల్ ద్రవిడ్ యువ ఆటగాళ్లకు పెద్ద పీట వేసిన విషయం తెలిసిందే. టెస్ట్, వన్డే, టీ20 ఫార్మాట్లలో భారత జట్టుకు భవిష్యత్తు రూపకల్పన చేయడంలో ద్రవిడ్ కీలక పాత్ర పోషించారు. అతడి ఆలోచన విధానం, ఆటగాళ్లను అర్థం చేసుకునే తత్వం సెలక్షన్ కమిటీ ఛైర్మన్ పదవికి సరైనదిగా బీసీసీఐ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఇటీవలి కాలంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అయితే రాబోయే సంవత్సరాల్లో భారత్‌కు వరుసగా పెద్ద టోర్నీలు ఉండటంతో.. కొత్త దృష్టికోణం అవసరమన్న అభిప్రాయం బోర్డు వర్గాల్లో వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ద్రవిడ్ పేరును బీసీసీఐ పరిశీలనలోకి తీసుకున్నట్లు సమాచారం.

ఈ వార్త నిజమైతే.. భారత క్రికెట్‌లో ఇది ఒక కీలక మలుపుగా మారే అవకాశం ఉంది. ఆటగాడిగా, కోచ్‌గా అపార అనుభవం ఉన్న రాహుల్ ద్రవిడ్.. సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపడితే, టీమిండియా జట్టు ఎంపిక ప్రక్రియలో స్పష్టత, స్థిరత్వం మరింత పెరుగుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ విషయంపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# తెలుగు నేర్చుకోవడం చాలా కష్టం

గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా దర్శకధీరుడు ఎస్.ఎస్ రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'వారణాసి' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ సినిమాలో రుద్రగా మహేష్ బాబు, మందాకినిగా ప్రియాంక చోప్రా, కుంభగా పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్నారు. ఇక రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ సినిమా కాబట్టి ఈ చిత్రంపై భారీ అంచనాలే ఉన్నాయి.

ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టైటిల్ టీజర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ భారీ స్టార్ కాస్టింగ్‌తో బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు ఖాయమనే అంచనాలు వినిపిస్తున్నాయి. రాజమౌళి తండ్రి కేవీ విజయేంద్ర ప్రసాద్ అందించిన కథ ఆధారంగా 'వారణాసి'ను గ్లోబ్ ట్రాటింగ్ యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందిస్తున్నారు. అయితే తాజాగా ఈ చిత్రబృందం ఓ నేషనల్ ఛానల్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్లోబల్ బ్యూటీను 'తెలుగుభాషతో మీ ప్రయాణం ఎలా ఉంది?' అని అడుగగా.. దానికి ఆమె స్పందిస్తూ.. 'నాకు తెలుగు అస్సలు రాదు.

నిజానికి తెలుగు భాష నేర్చుకోవడం చాలా కష్టం. మామూలుగా మాట్లాడటం ఒకెత్తయితే.. కెమెరా ముందు డైలాగ్ చెప్పడం మరో ఎత్తు. అందుకే ఈ విషయంలో రాజమౌళి హెల్ప్ తీసుకుంటున్నా. ఆయన నాకు డైలాగ్ అర్థం చెబుతారు. పాత్ర ఇన్‌టెన్షన్‌ని వివరిస్తారు. దాన్ని బట్టి ఓ పదినిమిషాలు దానిపై వర్క్ చేసి, అప్పుడు నా స్టైల్‌లో నేను డైలాగ్ చెప్తున్నా. నిజానికి అది అంత ఈజీ కాదు. అందరి సహకారం వల్లే అది సాధ్యమవుతోంది.' అంటూ సమాధానమిచ్చింది ప్రియాంక చోప్రా. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.



# ఫైనల్‌గా సెట్స్ మీదకు హనుమాన్ 2!




'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేసిన ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రాబోతున్న మరో పవర్‌ఫుల్ ప్రాజెక్ట్ 'హనుమాన్ 2'. ఈ సినిమాపై ఇప్పటికే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాగా.. ప్రేక్షకులు అండ్ సినీ లవర్స్‌లో హై ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. అలాగే హనుమంతుడిగా రిషబ్ శెట్టి ఫస్ట్ లుక్ పోస్టర్‌కు కూడా నెట్టింట్ సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఇదిలా ఉంటే.. ఈ మధ్య కాలంలో హనుమాన్ 2 నుంచి ఒక్క అప్డేట్ కూడా రాకపోవడంతో అసలు ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్తుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్న క్రమంలోనే తాజాగా అదిరిపోయే బజ్ నెట్టింట సందడి చేస్తుంది. చాలా గ్యాప్ తర్వాత ప్రశాంత్ వర్మ 'హనుమాన్2' సినిమాను లాక్ చేసినట్లు తెలుస్తుంది. మార్చి నుండి షూటింగ్ ప్లాన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తుండగా.. వచ్చే ఏడాది గ్రాండ్ పాన్-ఇండియా విడుదలకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

# స్పిరిట్ నుండి ప్రకాష్ రాజ్ అవుట్

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా సెన్సేషన్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో వస్తున్న చిత్రం 'స్పిరిట్'. ప్రస్తుతం ఇండియన్ సినిమాలో మోస్ట్ అవైటెడ్ చిత్రాలలో ఒకటైన 'స్పిరిట్' సెట్స్ నుండి ఒక షాకింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నటుడు ప్రకాష్ రాజ్ స్పిరిట్ నుండి వైదొలిగాడు. ఈ సినిమాపై అంచనాలను పెంచిన ఆడియో టీజర్ లో ప్రకాష్ రాజ్ వాయిస్ వినబడింది. అందులో ఆయన ఒక జైలర్ పాత్రలో ప్రభాస్‌ను విచారిస్తున్నట్లుగా గంభీరమైన గొంతుతో ఆకట్టుకున్నారు.

అయితే దర్శకుడు సందీప్ రెడ్డి వంగాకు ప్రకాష్ రాజ్ కు మధ్య తలెత్తిన క్రియేటివ్ డిఫరెన్సెస్ కారణంగా ఆయన ఈ ప్రాజెక్ట్ నుండి వైదొలిగినట్లు సమాచారం. అయితే, షూటింగ్ ప్రారంభమైన కొద్ది రోజులకే దర్శకుడి మేకింగ్ స్టైల్ లేదా సీన్ల చిత్రీకరణ విషయంలో దర్శకుడితో ప్రకాష్ రాజ్ కు ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఆయన తప్పుకొన్నాడట. ఈ సినిమా ప్రారంభం నుండి నటీనటుల మార్పుల విషయంలో వార్తల్లో నిలుస్తోంది. మొదట ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే నటిస్తుందని ప్రచారం జరిగింది. కానీ కొన్ని కారణాల వల్ల ఆమె ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకోగా, ఆమె స్థానంలో 'యానిమల్' ఫేమ్ తృప్తి దిమ్రిని తీసుకున్నాడు సందీప్ రెడ్డి. ఇప్పుడు సీనియర్ నటుడు ప్రకాష్ రాజ్ కూడా తప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రకాష్ రాజ్ స్థానంలో మరొక నటుడిని తీసుకుంటారా లేదా సందీప్ వంగా ఆయనను ఒప్పిస్తారా అనేది వేచి చూడాలి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ వార్తలపై అటు ప్రకాష్ రాజ్ గానీ, ఇటు చిత్ర యూనిట్ గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ప్రభాస్ ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తుండటంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి.



# ఫ్యాన్స్ కు డబుల్ ట్రీట్ ఇచ్చేందుకు రెడీ



వార్ 2 తో కాస్త డీలా పడిన యంగ్ టైగర్ ఎన్టీఆర్ తదుపరి చిత్రాలతో ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి సిద్ధమవుతున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా డ్రాగన్ సినిమా షూటింగ్ జార్జియాలో జరుగుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు ఒక పవర్ ఫుల్ గ్లింప్స్‌ను మే 19న ఎన్టీఆర్ బర్త్ డే కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో తారక్ లుక్ పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ చిత్రం జూన్ 25, 2026న విడుదల కానుంది.

ఇక ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఎప్పటి నుండో ఎదురుచూస్తున్న సినిమా గాడ్ ఆఫ్ వార్. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఎన్టీఆర్ చేయబోయే కొత్త సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా మే 19నే రాబోతోందని టాక్. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'అరవింద సమేత' సృష్టించిన ప్రభంజనం మనకు తెలిసిందే. ఇప్పుడు రాబోయే చిత్రం ఒక భారీ మైథలాజికల్ టచ్ ఉన్న సోషియో ఫాంటసీ కథగా 'గాడ్ ఆఫ్ వార్' రాబడుతోంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు కావడంతో, ఒకరోజు ముందే ఈ డబుల్ ధమాకా ఇవ్వడం ద్వారా అభిమానులకు ఫుల్ ట్రీట్ ఇవ్వడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ రెండు చిత్రాలే కాకుండా దేవర 2 కి సంబంధించిన అప్‌డేట్స్ కూడా అదే సమయంలో వచ్చే అవకాశం ఉంది. ఏదేమైనా ఎన్టీఆర్ ఫ్యాన్స్ కు ఈ బర్త్ డే ఎంతో స్పెషల్ గా ఉండబోతుంది.

# కిరణ్ అబ్బవరం హీరోగా భారీ మైథలాజికల్ సినిమా ఫిక్స్



ప్రఖ్యాత నిర్మాత ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ అధినేత ఉమేష్ బన్సాల్తో కలిసి టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా ఒక భారీ పాన్-ఇండియా చిత్రంను నిర్మించనున్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన కథతో, అద్భుతమైన విజువల్స్‌తో ఈ సినిమాను మిథాలజీ యాక్షన్ ఎంటర్టైనర్గా తెరకెక్కించనున్నారు.

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా, గ్రాండ్ విజువల్స్, వరల్డ్ బిల్డింగ్, హై టెక్నికల్ వాల్యూస్‌తో సినిమాను నిర్మించేలా పనులు ప్రారంభమయ్యాయి. ఈ సినిమా షూటింగ్‌ను సెప్టెంబర్‌లో ప్రారంభించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.ఇదే సమయంలో హీరోయిన్ ఎంపికపై బాలీవుడ్, టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నటీమణుల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. సినిమా టైటిల్, దర్శకుడు, ఇతర నటీనటులు మరియు సాంకేతిక బృంద వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. భక్తి, భావోద్వేగాలు, డ్రామా, హై-వోల్టేజ్ యాక్షన్‌ను సమన్వయం చేస్తూ రూపొందుతున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, #####, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com